



ధారపల్లి జలపాతం



తోటపల్లి జలపాతం



రమణీయమైన ప్రకృతి సౌందర్యానికి దాసోహం కాని వారెవరు.. అందుకే కార్తీక మాసం వచ్చిందంటే ప్రతి ఒక్కరూ ప్రకృతి ఒడిలో ఒదిగిపోవాలని తపిస్తారు. పిక్నిక్‌ల పేరిట సహజమైన సుందర ప్రదేశాలకు సందర్శనకు క్యూకడతారు. అహ్లాదం కలిగించే తోటలు, హాయినిచ్చే ఏజెన్సీ ప్రాంతాల్లో విహరిస్తారు. వేకువజామునే మంచు తెరలు వీడి చల్ల గాలులు వీస్తుండగా ఆయా ప్రాంతాలకు బయలుదేరి సరికొత్త లోకంలోకి వెళ్లిన అనుభూతి పొందుతారు. అక్కడ ఆటపాటలతో, మధురమైన జ్ఞాపకాలను మూటగట్టుకుని తిరిగి వస్తారు. ఇలాంటి ఎన్నో ప్రకృతి రమణీయ ప్రాంతాలకు ఉమ్మడి తూర్పుగోదావరి నెలవు. మరీ ముఖ్యంగా అబ్బురపరిచే జలపాతాలకు పెట్టింది పేరు. దట్టమైన అటవీ ప్రాంతాల్లోకి వెళ్లి కొండల్లోంచి వాగుల్లోకి జాలువారుతున్న జలపాతాల్లో తడిసి ముద్దయ్యాక పొందే ఆనందం మాటల్లో చెప్పలేనిది. ఆ జల పాతాల సవ్వడి మీరూ వింటారా మరి..


జల జల జల జలపాతం సవ్వడి..

ఆదివారం ప్రత్యేకం

ఉమ్మడి తూర్పుగోదావరిలో
ఎన్నెన్నో సోయగాల జలపాతాలు
జాలువారుతూ.. మైమరిపిస్తూ...
అటు ఏజెన్సీ, ఇటు రిజర్వు
ఫారెస్టులోనూ నిత్య సవ్వడులు




జలతరంగిణి జలపాతం



పొల్లూరు జలపాతం



పాములేరు వాగు



సీతపల్లి వాగు



రంప జలపాతం

ఏజెన్సీ అందాలకు ఆభరణాలు జలపాతాలే..

(ఆంధ్రజ్యోతి-రంపచోడవరం/చింతూరు)

మన్యం ఫారెస్టుకు వెళ్లేవారి దృష్టంతా జలపాతాల జలకాలాటలపైనే ఉంటుంది. దట్టమైన అడవిలో విహరిస్తూనే ప్రధానంగా జలపాతాల సవ్వడిని ఆస్వాదించాలని ఆరాటపడతారు. ఇలాంటి వాటర్ ఫాల్స్ పేరు చెప్పగానే మొదట గుర్తొచ్చేది ఉమ్మడి తూర్పుగోదావరిలో జిల్లాలోని (ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా) రంప ఏజెన్సీనే. ఇక్కడ పారే వాగులన్నీ ఏదొక కొండ మీద నుంచి జాలువారుతూ పుట్టినవే. ఇందులో రంపచోడవరం మండలంలోని రంపజలపాతం, సీతపల్లి వాగు ఉండగా మారేడుమిల్లి మండలంలో జలతరంగిణి, అమృతధార, పాములేరు వాగులు ప్రధానం. ఆయా వాగుల జలపాతాల వద్ద స్నానాలు చేయడమంటే అందరికీ సరదానే. కార్తీక మాసంలో ఇక్కడకు విహార యాత్రికుల సందడి అధికంగా ఉంటుంది. రంపలో పురాతన శివాలయం ఎగువన ఒక జలపాతం ఉంది. మారేడుమిల్లి మండలంలో అటవీశాఖ ఆధ్వర్యంలో జలతరంగిణి, అమృతధార జలపాతాలు, పాములేరు వాగు టూరిస్టుల స్పాట్‌గా నడుస్తున్నాయి. అయితే యాత్రికులు ఈ ప్రాంతాలను సందర్శించే క్రమంలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ఈ ప్రాంతాలు విషాదాన్ని మిగుల్చుతాయి.

పోదామా.. పొల్లూరు జలపాతానికి..

చింతూరు నుంచి 36 కిలోమీటర్ల దూరంలో పొల్లూరు జలపాతం ఉంది. చింతూరుకు 18 కిలోమీటర్ల దూరంలో సోకిలేరు వ్యూ పాయింటు ఉంది. చింతూరు నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఒడిసా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల ప్రవేశాలతోపాటు శబరి, సీలేరు నదుల సంగమం చూడొచ్చు. చింతూరు నుంచి 30 కిలోమీటర్ల దూరంలో కూనవరం వద్ద గోదావరి ప్రవాహంలో శబరి, సీలేరు నదుల కలయిక చూడొచ్చు. అక్కడి నుంచి 22 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే పోచవరం... అక్కడి నుంచి 20 కిలోమీటర్ల దూరం బోటుపై ప్రయాణించి పాపికొండలు చేరుకోవచ్చు. ఇక పొల్లూరు జలపాతంతోపాటు సోకిలేరు వ్యూ పాయింటు వద్ద పర్యాటకులు అత్యంత జాగ్రత్తను వహించాలి. పొల్లూరు జలపాతం సందర్శనను ఇటీవలే తిరిగి ప్రారంభించారు.



కనుల విందు.. ధారపల్లి జలపాతం

(ఆంధ్రజ్యోతి-ప్రత్తిపాడు)

పచ్చటి చెట్ల మధ్య ఎత్తైన కొండల నుంచి జాలువారే జలపాతాలు... రిజర్వ్ ఫారెస్ట్‌లో ఈ ప్రకృతి అందాల నడుమ ఈ జలపాతాల్లో స్నానాలు ఆచరించడం ఓ మధురానుభూతి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట గిరిజన గ్రామ పంచాయతీ పరిధిలో ధారపల్లి జలపాతం ఉంది. ప్రత్తిపాడుకు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ జలపాతం మూడు నాలుగు పాయలుగా కొండపై నుంచి జాలువారుతుండడంతో స్నానాలు స్నానాలు చేసేందుకు సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. ఈ జలపాతం చేరుకోవాలంటే ప్రత్తిపాడు నుంచి ఉత్తరకంచి, పెద్దిపాలెం, కిత్తమూరి పేట నుంచి ధారపల్లి చేరుకుని కొండ ఎక్కాల్సిందే. జలపాతం దిగువన ఏనుగు బండరాయిలొద్దులో నందీశ్వరుడు, శివలింగం ఉండడంతో సందర్శకులు కార్తీకమాసంలో ఇక్కడకు తరలివస్తారు. అలాగే ఎరకంపాలెంలో మరో జలపాతం ఉంది. ఇది శివలింగాన్ని అభిషేకిస్తూ కొండ నుంచి కిందకు జాలువారుతుండడంతో ఆ జలాల్లో స్నానాలు ఆచరించేందుకు భక్తులు తరలివస్తున్నారు. ఈ ప్రదేశం చేరుకోవడానికి ప్రత్తిపాడు నుంచి లంపకలోవ, రౌతుపాలెం, గోకవరం మీదుగా ఎరకంపాలెం కొండ ఎక్కాల్సిందే. ఈ కొండ దారి నిటారుగా ఉండడంతో ఈ మార్గంలో ఒకింత సాహసంతో నడవాలి. ప్రత్తిపాడు మండలంలోనే తోటపల్లి జలపాతం ఉంది. ప్రత్తిపాడుకు 20 కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం తోటపల్లి కొండల్లో జాలువారుతుంది. ప్రత్తిపాడు, రాచపల్లి, ఒమ్మంగి, శరభవరం, శాంతి ఆశ్రమం, వెంకటనగరం మీదుగా తోటపల్లి గ్రామానికి కిలోమీటరు దూరంలో ఈ జలపాతం ఉంది.

ఆహా అనేలా.. లొట్టలేసి తినేలా..

అల్పాహారంలో ఇవి
మన 'స్పెషల్' రుచులు
టిఫిన్ సెంటర్ల నుంచి ఏకంగా
పెళ్లిళ్ల వరకూ ఇదో మెనూ
తెల్లవారుజాము నుంచే
ఆయా దుకాణాల వద్ద రద్దీ
చౌక ధరల్లోనే లభ్యం

6

గ్రామీణ రోడ్లకు మరిన్ని నిధులు

శరవేగంగా సీసీ రోడ్ల నిర్మాణాలు
తొలి దఫా రూ.82 కోట్లు
తాజాగా ఇప్పుడు మరో రూ.20 కోట్లు
మొత్తం రూ.102 కోట్లతో రోడ్లు, డ్రైన్లు
కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి పట్టం
హర్షం వ్యక్తంచేస్తున్న గ్రామీణ ప్రజలు
ఉపాధి హామీ నిధులతో రోడ్లు పటిష్టం

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణాలకు మరెన్నీ నిధులు సుమకూరాయి. దీంతో గ్రామాల్లో రూపురేఖలు మారుతున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్లు సర్వాంగ సుందరంగా తయారవుతున్నాయి. కాకినాడ జిల్లాలో 20 మండలాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈఏడాది అక్టోబరు నెలలో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ఈ పనులు ప్రారంభమయ్యాయి. అప్పట్లో రోడ్లకు రూ.82 కోట్లు నిధులు కేటాయించారు. అయితే తాజాగా మరో రూ.20 కోట్ల నిధులు విడుదల చేశారు. దీంతో మొత్తం రూ.102 కోట్ల పనులు గ్రామాల్లో జరుగుతున్నాయి. దీనిలో రూ.88 కోట్ల పనులు ప్రారంభమై కొనసాగుతున్నాయి. మరో రూ.14 కోట్ల పనులు ఈవారంలో ప్రారంభానికి సిద్ధం అవుతున్నాయి. దీంతో గ్రామాల్లో ధ్వంసమైన రోడ్లకు మోక్షం కలిగింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేశారు. ఉపాధి హామీ నిధులతో రోడ్లు మరింతగా పటిష్టం అవుతున్నాయి. ఇందులో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు నిర్మాణాలను మండలస్థాయిలో ఎంపీడీవోల ఆధ్వర్యంలోనే గుర్తించారు. నామినేషన్ పద్ధతిలో పనులు పూర్తి చేస్తున్నారు. పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీర్ల పర్యవేక్షణలో రోడ్ల నిర్మాణాలు సాగుతున్నాయి.

వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రోడ్డు కూడా నిర్మించలేదు. దీనివల్ల గ్రామీణులు అనేక ఇబ్బందులుపడ్డారు. గ్రామాల నుంచి పట్టణాలకు వివిధ అవసరాల నిమిత్తం వచ్చే గ్రామీణులు రోడ్ల అధ్వానంతో ప్రమాదాల బారినపడ్డారు. గ్రామాల నుంచి రోజూ ఉపాధి కోసం నగరాలకు వచ్చేకూలీలు గతుకుల రోడ్లతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక నుంచి ఆ సమస్య తీరనుంది.

సాంకేతిక పర్యవేక్షణ

గ్రామ సభల్లో గుర్తించిన ఈ పనులు వెండర్, ఏజన్సీలకు అప్పగిస్తున్నారు. నామినేషన్ పద్ధతిలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో అగ్రిమెంట్లు చేసి పనులను అప్పగిస్తున్నారు. పంచాయతీరాజ్ ఏఈలతోపాటు డ్వామా నుంచి టీఏలను వినియోగించి పనుల్లో నాణ్యత ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పనులు 2024-25 సంవత్సరం మధ్య పూర్తి చేసేలా వేగవంతం చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులతో గ్రామీణ ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నూరుశాతం నిర్మాణాలు : కలెక్టర్

గ్రామాల్లో ధ్వంసమైన రోడ్లు నూరుశాతం నిర్మాణాలు పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ షాన్‌మోహన్ చెప్పారు. రోడ్ల నిమిత్తం ఉపాధి హామీ నిధులు రూ.110 కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు రూ.102 కోట్ల నిధులు విడుదల చేశాం. మిగిలిన రూ.8 కోట్లు కూడా ప్రాధాన్యత క్రమంలో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు నిర్మిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటామని కలెక్టర్ తెలియజేశారు.



భారీ గోతులతో అధ్వానంగా మారిన జి.బావారం-యండమూరు రోడ్డు

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో..!

కరప, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో జి.బావారం-యండమూరు రహదారి భారీగోతులతో అధ్వానంగా మారింది. రాత్రి వేళ చీకట్లో ఈ రహదారి వెంబడి వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. జి.బావారం దాటి యండమూరు దగ్గర్లో ఏర్పడిన భారీ గొయ్యి ప్రాణసంకటంగా మారింది. రామచంద్రపురం నుంచి కాకినాడకు రోజు రెండు ట్రిప్పులు తిరిగే ఆర్టీసీ బస్సును ఈ భారీ గొయ్యి వల్ల నిలిపివేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ రహదారికి మళ్లీ ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్‌మీనా

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి : జేసీ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, రోడ్డు భవనాలు శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణ పనులకు సంబంధించి ఆటంకం లేకుండా వేమగిరి, తీపర్రు దగ్గర ఇసుక రీచ్‌లు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించడం జరిగిందన్నారు. అలాగే కాకినాడ జిల్లాలో కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలు మూడు ప్రాంతాల్లో ఇసుక స్టాక్‌పాయింట్ల నిర్వహణకు అవసరమైన ఏజన్సీలను ఇప్పటికే గుర్తించడం జరిగిందని, త్వరలో ఇసుక స్టాక్ పాయింట్లు నుంచి కూడా ఇసుక బుక్ చేసుకోవచ్చన్నారు. జాతీయ రహదారి పనులకు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతంచేసి, పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కారవ్యవస్థ కార్యక్రమంలో రెవెన్యూ విషయాలపై అందిన అర్జీలపై శ్రద్ధ వహించి అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారాలు అందించాలన్నారు. నగరవనం, స్మశాన వాటికలు, డంపింగ్ యార్డుల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో వెంకట్రావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, ఎన్‌ఎచ్‌ఏఐ పీడీ బెనర్జీ, రోడ్డు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కంతు, పౌరసరఫరాల సంస్థ డీఎం దేవులనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్
అవగాహన సదస్సులో
విద్యార్థుల ఆరోపణ
ఉపాధ్యాయుడికి దేహశుద్ధి
చేసిన తల్లిదండ్రులు
పోలీసుల అదుపులో
నిందితుడు
కాకినాడ జగన్నాథపురంలోని
హైస్కూల్‌లో ఘటన

7



కేంద్ర పథకాలతో మత్స్యకార గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్సీ పద్మశ్రీ

కాకినాడసిటీ, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు కేంద్రం నుంచి వచ్చిన పథకాలను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉపయోగించుకుని మత్స్యకార గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని కాకినాడకు చెందిన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. శాసనమండలి సమావేశాల్లో శనివారం ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా దేశ వ్యాప్తంగా 100 తీరప్రాంత మత్స్యకార గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు మంజూరు చేశారన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 15 మత్స్యకార గ్రామాల అభివృద్ధికి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. అయితే అమలాపురం నుంచి ఓడలరేవు, మచిలీపట్నం నుంచి కిలతలదిండి, కాకినాడ జిల్లాలో ఉప్పాడ నుంచి కోనపాపపేట వరకు మత్స్యకార గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఏపీ గ్రామాలను ఏవిధంగా అభివృద్ధి చేయవచ్చో పద్మశ్రీ వివరించారు.

పట్టభద్రుల ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

ఓటర్లు 2,61,728
వచ్చే నెల 9వ తేదీ వరకు
అభ్యంతరాల స్వీకరణ

6

కాకినాడ అభివృద్ధికి నిధులు అడుగుతాం

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధితోపాటు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, కొత్త ప్రాజెక్టుల కోసం పార్లమెంట్‌లో గళం వినిపిస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 25 నుంచి డిసెంబరు 20 వరకు జరగనున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. శీతాకాల సమావేశాల్లో కూటమి ఎంపీలు రాష్ట్ర అభివృద్ధికి కలిసికట్టుగా పోరాడతామని తెలియజేశారు.

జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసుల డ్రోన్ల వినియోగం



డ్రోన్ల ద్వారా నేరస్తులను పట్టుకుంటున్న పోలీసులు

కాకినాడ క్రైం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పోలీసులు సరికొత్త పంథాను అనుసరిస్తున్నారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాలతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నేరాలను అదుపుచేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా డ్రోన్ల సహాయంతో నేరాలు జరగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను గుర్తించారు. తోటలు, బహిరంగ ప్రదేశాలు, పార్కులు, నిర్జన ప్రాంతాల్లోకి డ్రోన్స్‌ను పంపి నిఘా ఏర్పాటుచేస్తున్నా రు. శనివారం కాకినాడ శివారు ప్రాంతాలైన ఏటిమొగ, తూరంగి, జగన్నాథపురం, పోర్ట్ పరిసర ప్రాంతాల్లో డ్రోన్స్ ద్వారా నిఘా పెట్టి దాడులు నిర్వహించారు ఈ దాడుల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పలువురిని అరెస్టులు చేసి కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విధానం నేరాలను మరింత కట్టడి చేయడానికి దోహదపడుతుందని ఎస్పీ తెలిపారు.



కాకినాడ చిట్టి పెసరట్టు తయారీ



ఆహా అనేలా.. లొట్టలేసి తినేలా

మన టిఫిన్స్.. అదుర్స్

ఆదివారం కదా.. ఉదయం లేస్తూనే ఏంటి ఈరోజు స్పెషల్ అంటారు పిల్లల నుంచి పెద్దల వరకూ. మిగతా రోజుల్లో ఇడ్లీనో, ఉప్మానో సరిపెట్టుకుంటాంగానీ.. ఈరోజు మాత్రం కచ్చితంగా బ్రేక్‌ఫాస్ట్ అదిరిపోవాల్సిందేనంటూ పట్టుబడతారు. దీంతో ఇంట్లో టిఫిన్లకు ఆరోజు సెలవిచ్చి బయట రుచుల కోసం వేటాడతారు మరికొందరు. ఎక్కడ ఏది ఫేమస్సో సెర్చ్ చేస్తారు ఇంకొందరు. ఇక బయట ప్రాంతాల నుంచి వచ్చేవారైతే వెళ్లే దారిలో ఏ అల్పాహారం బాగుంటుందో ముందే ఆరా తీస్తారు. అప్పుడు అనేక అల్పాహార హోటళ్లు గుర్తుకువస్తాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇలాంటి హోటళ్లకు కొదవ లేదు. రావులపాలెంలో అన్‌లిమిటెడ్ అల్పాహార రుచులు ఫేమస్ గురూ అంటారొకరు. ఇక కోనసీమ వెళితే అంబాజీపేట పొట్టిక్కలు తినకుండా వెళ్లగలమా అని మరో మిత్రుడు సవాల్ విసురుతాడు. కాకినాడ వెళితే చిట్టి పెసరట్టులు రుచి చూడకుండా రావొద్దని హెచ్చరిక జారీ చేస్తాడు మరో హితుడు. వైజాగ్ వెళుతుంటే తేటగుంటలో తప్పకుండా ఆగు.. ఉప్మా పెసరట్టు తినేసి పో అంటాడు మరొకాయన. సరదాగా ఆ రుచుల కబుర్లు చెప్పుకుందామా..

పెసరట్టు..అదిరేట్టు..

కాకినాడ చిట్టి పెసరట్టు టేస్టే వేరబ్బా

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చిట్టి పెసరట్టు అనే పేరు వినగానే ముందుగా గుర్తొచ్చేది కాకినాడ. పెద్ద మార్కెట్ పెద్ద శివాలయం వద్ద అమ్మే ఈ చిట్టి పెసరట్టు టేస్ట్ మామూలుగా ఉండదు. 50 ఏళ్ల నుంచి ఈ పెసరట్టు రుచిని పంచుతున్నారు.. సాధారణంగా హోటల్స్‌లో దొరికే పెసరట్టు టేస్ట్‌కంటే ఇక్కడ దొరికే పెసరట్టు టేస్ట్ అద్భుతంగా ఉంటుందని అక్కడ తిన్న ప్రతి ఒక్కరూ చెప్తారు. దీనికి కారణం పొట్టు పెసరపప్పును గ్రైండర్‌లో రుబ్బి కట్టెల పొయ్యిపై కాల్చడం వల్లే ఈ రుచి వస్తుందని హోటల్ నిర్వాహకులు చెబుతున్నారు. పెసరట్టు ఉప్మాతో పాటు కారంపొడి వేసుకుని తింటే ఆ రుచి వేరని అందుకే సుదూర ప్రాంతాల నుంచి కూడా పెసరట్ల కోసం మాత్రమే ఇక్కడికి వచ్చి తిని వెళుతుంటారని చాలా మంది చెబుతున్నారు. రెండు పెసరట్లు ఉప్మా ధర రూ.30.

సినీ ప్రముఖులు రుచిచూసిన అట్టు

అగ్ర కథానాయకులు ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావుతోపాటు చిరంజీవి, పవన్‌కల్యాణ్, అల్లుఅర్జున్ వరకు కాకినాడ చిట్టి పెసరట్టును రుచి చూసినవారే. గతంలో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాకినాడ పర్యటనలో భాగంగా చిట్టి పెసరట్టును రుచి చూశారని హోటల్ నిర్వాహకులు చెబుతున్నారు. అలాగే అక్కినేని నాగేశ్వరరావు పరిసర ప్రాంతాల షూటింగ్‌లోకి వచ్చినప్పుడు రుచి చూశారు. చిరంజీవి, పవన్‌కల్యాణ్ కూడా షూటింగ్ సందర్భంగా కాకినాడ విచ్చేస్తున్నప్పుడు రుచి చూసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మధ్యకాలంలో పుష్ప-2 షూటింగ్‌కి వచ్చిన అల్లు అర్జున్ కూడా చిట్టి పెసరట్లను ఆరగించారు.

తేటగుంట నేతి పెసరట్టు

మళ్లీ మళ్లీ తినేటట్టు..

తుని రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉప్మా పెసరట్లు చాలాచోట్ల అమ్ముతుంటారు. కానీ కొన్ని చోట్లే ఎక్కువ ఫేమస్ అవుతుంటాయి.. ఇప్పుడు అలాంటి ఫేమస్ పెసరట్టు ఉప్మా గురించి మీకు చెప్పబోతున్నాం.. రాజమహేంద్రవరం-విశాఖపట్నం జాతీయ రహదారిపై అన్నవరం దాటిన తర్వాత తేటగుంట అనే ఒక గ్రామ కూడలి వస్తుంది. ఇక్కడ ఎప్పుడైనా పెసరట్టు ఉప్మా ట్రై చేశారా? లేకపోతే ఈసారి ట్రై చేయండి.. ఒట్టు.. అదుర్స్ ఈ పెసరట్టు.. ఇక్కడ పెసరట్టు ఉప్మా ఎంత ఫేమస్ అంటే ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఒక్క షాపు కూడా ఖాళీ ఉండదు.. ముఖ్యంగా రెండు మూడు హోటల్స్ దగ్గర అయితే ప్లేట్‌లోకి పెసరట్టు ఉప్మా ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తుంటారు.. సలసల కాగే పెనం మీద పచ్చని పెసర రుబ్బును గరిటెతో తీసి పెనం మీద వేసి దానిపై సన్నగా తరిగిన ఉల్లిపాయలు, జీలకర్ర, జీడిపప్పు వేసి కారం పొడి జల్లి, నెయ్యి దట్టించి కాల్చే ఈ పెసరట్టును చూస్తుంటేనే నోట్లో నీరు సుడులు తిరుగుతుంది.. అంత కమ్మగా ఉంటుంది ఈ ఉప్మా పెసరట్టు.. ఇక ఈ పెసరట్టు ఉప్మాలోకి వేసే చట్నీలు కూడా ఇక్కడ స్పెషలే.. ముఖ్యంగా దబ్బకాయ చట్నీ, అల్లం చట్నీలతో పెసరట్టు, ఉప్మాను లొట్టలేసుకుని మరీ తింటుంటారు. దుకాణాలు చిన్నవే అయినా ఇక్కడ ఆగే కార్లు, బైక్‌ల సంఖ్య చాలా పెద్దది. అన్ని దుకాణాల్లో కలిపి రెండు, మూడు వేల పెసరట్టు ఉప్మాలు సేల్ అయిపోతాయి.. వీళ్లు స్వయంగా పొలాలకు వెళ్లి పెసలు తెచ్చుకుంటారు. వాటిని ఒక ప్రత్యేక పద్ధతిలో శుభ్రం చేస్తారు. కొన్ని చోట్ల రోటిలోనే రుబ్బుతారు. నెయ్యిని కూడా వీరు సొంతంగానే తయారు చేసుకుంటారు. సుమారు 60 ఏళ్ల నుంచి ఇక్కడ టిఫిన్ బండ్లు ఉండేవి.. కాకపోతే 20 ఏళ్ల నుంచి ఉప్మా పెసరట్టు బాగా ఫేమస్ అయ్యి.. తేటగుంట పేరునే మార్చేశాయి. అందుకే ఇప్పుడు రాజమహేంద్రవరం-విశాఖపట్నం జాతీయ రహదారిపై ప్రయాణించే చాలామంది ప్రయాణికులు 'తేటగుంట దగ్గర ఆపండి.. ఉప్మా పెసరట్టు తినిపోదాం'.. అంటున్నారు..



అంబాజీపేట పొట్టిక్కలు



తేటగుంట పెసరట్టు



కాకినాడ చిట్టి పెసరట్టు

భలే..భలే పొట్టిక్కలు



అంబాజీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట పేరు చెప్పగానే అందరికీ గుర్తుకువచ్చేది పొట్టిక్కలు. పెద్ద హోటల్ నుంచి చిన్న హోటల్స్ వరకు టిఫిన్ అడిగితే ముందుగా పొట్టిక్కలు చెప్పి తరువాతే మిగిలినవి చెబుతుంటారు. ఇడ్లీ మాదిరిగానే ఉండే పొట్టిక్కలలో పనస ఆకుల నుంచి వచ్చే పత్రహరితం, సువాసనతో పొట్టిక్కలు మంచి రుచికరంగా ఉంటాయి. వీటి తయారీలోనూ రుచిలోను వాటికి ఉన్న ప్రాముఖ్యం అటువంటిది. అంబాజీపేటలోని బంధువుల ఇళ్లకు వచ్చినవారు, ఇతర ప్రాంతాల నుంచి ఈ ప్రాంతానికి వచ్చే వారు, సినీ పరిశ్రమకు చెందినవారు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు అంబాజీపేట మీదుగా వెళితే కచ్చితంగా అంబాజీపేట పొట్టిక్కలను రుచిచూసి మరీ వెళతారు. పొట్టిక్కలు ప్రస్తుతం విందులు, వినోదాలలోను ప్రధాన అల్పాహారంగా చోటు దక్కించుకుంది..

పోషకాలు మెండు..

పనస ఆకు శాస్త్రీయ నామం ఆర్టోకార్పస్ ఇంటిగ్రిఫోలియా. దీనిలో ఈథర్, ఎక్స్‌ట్రాస్ట్, అల్బుమినాయిడ్స్ డైజేషన్ కార్బోహైడ్రేట్స్ ఫైబర్ సైనోమెట్రోక్లోరిన్ క్రిష్టలాయిడ్‌లో ఉంటాయి. పొట్టిక్కలు తయారు చేసేటప్పుడు పనసాకుల నుంచి వచ్చిన ఆవిరితో పత్రహరితం పోషకాలు పొట్టిక్కలోనికి చేరుతాయి. ఈ పొట్టిక్కలు తినడం ద్వారా సులువుగా జీర్ణమవుతుంది..

ప్రముఖులు మెచ్చిన పొట్టిక్కలు

సినీనటుడు తనికెళ్ల భరణి అంబాజీపేటలోని గణపతి టిఫిన్స్ సెంటర్‌కు వెళ్లి మరీ పొట్టిక్కలు తినివెళ్లారు. అలాగే దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి అంబాజీపేట వచ్చినప్పుడల్లా పొట్టిక్కలు తినేవారు. అలాగే మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఈ ప్రాంతంలో పొట్టిక్కలు ఆరగించేవారు.



ఇలా తయారు చేస్తారు.

పనసచెట్టు ఆకులను కొబ్బరి ఈనెల సహాయంతో చిన్న చిన్న బుట్టలుగా అల్లుతారు. ఆ బుట్టలను నీటిలో శుభ్రపరచి ఇడ్లీ పిండి (మినప పిండి, ఇడ్లీరవ్వ)తో నింపుతారు. పిండితో నింపిన బుట్టలను ఇడ్లీ పాత్రలో పెట్టి ఆవిరితో ఉడికిస్తారు. వేడివేడి పొట్టిక్కలు తయారైనట్టే. ఉడికిన పొట్టిక్కలను బుట్టలో వలిచి వేడివేడిగా వడ్డిస్తారు. కొబ్బరి చట్నీ, ముంబై చట్నీ, దబ్బకాయ చట్నీతోపాటు కారంపొడి, నెయ్యి కాంబినేషన్‌తో తింటే ఆ రుచే వేరు. సుమారు 65 ఏళ్ల పైబడి అంబాజీపేటలో పొట్టిక్కలను తయారు చేస్తున్నారు. ఇప్పటికీ అల్పాహార విందులో పొట్టిక్క హవా కొనసాగుతూనే ఉంది. గతంలో రూపాయి నుంచి పొట్టిక్క అమ్మకం ప్రారంభించి నేడు ఒక్క పొట్టిక్క ఖరీదు రూ.10 పైబడి అమ్ముతున్నారు.

కార్తీకంలో లక్ష మార్కు దాటిన వ్రతాలు





వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

అన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం సత్యదేవుడి సన్నిధిలో క్రోధి నామసంవత్సరం కార్తీక మాసంలో భక్తులు ఆచరించిన వ్రతాల సంఖ్య శనివారంతో లక్ష మార్కు దాటి 1,02,561కి చేరాయి. కార్తీక మాసం ముగిసే నాటికి మరో 40వేలవ్రతాలు జరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం 5,823 వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా రూ.60 లక్షల ఆదాయం సమకూరింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సత్యదేవా నిత్యాన్నదాన పథకం ద్వారా 20వేల మందికి ఉచిత అన్నదాన పథకం ద్వారా పులిహోర, దద్దోజన ప్రసాదం అందజేశారు.

సత్యదేవుడికి జన్మ నక్షత్ర పూజలు

కోరిన కోర్కెలు తీర్చే కలియుగదైవం సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా శనివారం ప్రధానాలయంలో మూలవరులకు ప్రత్యేకపూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వేకువజామున 12.30కి స్వామి అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపచేశారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు అనంతరం మూలవరులను పంచామృతాలతో అభిషేకం చేశారు. నూతన పట్టువస్త్రాలు ధరింపచేసి సుగంధభరిత పుష్పాలతో అలంకరించి అనంతరం సర్వదర్శనాలకు అనుమతించారు.

దీక్షలు విరమించిన సత్యదీక్షాపరులు

27రోజులు నియమనిష్ఠలతో సత్యదీక్షలు చేపట్టిన దీక్షాపరులు శనివారం దీక్షలను విరమించారు. వార్షిక కల్యాణ మండపం వద్ద అర్చకస్వాములు సత్యదీక్షాపరుల నుంచి ఇరుముడిలను స్వీకరించారు. అనంతరం దీక్షాపరులు కల్యాణవేదిక ప్రక్కనే ఉన్న హోమగుండంలో టెంకాయి, ఇతర ద్రవ్యాలను అర్పించారు. స్వామిని దర్శించుకుని దీక్షాపరులందరికీ ఉచిత సామూహిక సత్యనారాయణ స్వామివ్రతాల్లో పాల్గొన్నారు.

భక్తవత్సల.. గోవింద

- వాడపల్లి వేంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.46.01లక్షలు





వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామి వారిని వివిధరకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఆదాయం రూ.46.01లక్షలు లభించినట్టు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

8 మంది నూతన జంటలకు

పట్టుచీర, బంగారు చెవిదిద్దులు



పట్టుచీర, బంగారు చెవిదిద్దులు అందజేస్తున్న ఎన్ఆర్ఐలు

అన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యగిరికొండపై ఉన్న ఉచిత కల్యాణమండపాల్లో శుక్రవారం వివాహం చేసుకున్న 8మంది జంటలకు ఇద్దరు ఎన్ఆర్ఐ దంపతులు రూ.1.50లక్షలు విలువ చొప్పున బహుమతులు ఉచితంగా అందజేశారు. చికాగోకు చెందిన గోపిశెట్టి నాగజ, చంద్రశేఖర్ దంపతులు, గెడ్డం సూర్య సత్యదుర్గ దంపతులు వీటిని అందజేశారు. ఒక్కొక్కరికి పట్టుచీర, రెండుగ్రాముల బంగారు చెవిదిద్దులు, రూ.వెయ్యి నగదు అందజేశారు.

విద్యాభివృద్ధికి క్రీడలు దోహదం

జడ్పీ సీఈవో లక్ష్మణరావు... రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం





రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ సీఈవో లక్ష్మణరావు, మొదటిరోజు విజేతలు

కాకినాడ అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి క్రీడలు దోహదం చేస్తాయని జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు అన్నారు. శనివారం పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలను కాకినాడ డీఎస్ఏ మైదానంలో లక్ష్మణరావు ప్రారంభించారు. అండర్-17 విభాగంలో నిర్వహిస్తున్న పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 16మంది క్రీడాకారులు హాజరయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. రెండ్రోజులు నిర్వహించే పోటీల్లో విజేతలను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. డీఎస్‌డీవో బి.శ్రీని వాసకుమార్, రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు నాగేంద్రకుమార్, సానా సతీష్ ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, రమణరాజు, లక్ష్మణ్, పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కె.నూకరాజుపాల్గొన్నారు.

మొదటి రోజు విజేతలు వీరే

అనంతపురంపై గుంటూరు 10.0, చిత్తూరుపై శ్రీకాకుళం 20.0, కర్నూలుపై తూర్పుగోదావరి 23.0, విశాఖపై ప్రకాశం 15.0 స్కోరుతో గెలుపొంది సెమీ ఫైనల్‌కి చేరాయి.

స్వగ్రామానికి చేరుకున్న

కువైట్ బాధిత మహిళ

మంత్రులు, జిల్లా అధికారులకు కుమారి కుటుంబం కృతజ్ఞతలు



యల్లమిల్లిలోని కుటుంబ సభ్యులతో గారా కుమారి

గండేపల్లి, నవంబరు23(ఆంధ్రజ్యోతి):బతుకుతెరువు కోసం కువైట్ వెళ్లి అక్కడ చిత్ర హింసలకు గురైన కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన మహిళ గారా కుమారి రాష్ట్ర ప్రభుత్వం చొరవతో శనివారం స్వగ్రామానికి చేరుకుంది. భర్త చనిపోయి ఇల్లు గడవడం కష్టమైన పరిస్థితుల్లో పిల్లల పోషణ, భవిష్యత్తు కోసం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఏజెంట్ ఎం.సుధాకర్ ద్వారా గత మే నెల ఒకటో తేదీన ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లింది. అయితే ఆమె పనిచేస్తున్న చోట యజమాని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఉపాధి కోసం విదేశాల్లో నానా అవస్థలు పడుతున్న వారిని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదుకుంటున్న విషయాన్ని తెలుసుకున్న ఆమె పడుతున్న అవస్థలపై వీడియోగా చిత్రీకరించి సోదరుడు కర్రిపోతు సూర్యచంద్ర ద్వారా వారికి పంపింది. ఆమె దీన పరిస్థితికి చలించిన మంత్రులు కువైట్‌లోని భారత రాయబార కార్యాలయంతో చర్చించి ఆమె తిరిగి స్వదేశానికి వచ్చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. మంత్రుల చొరవతో కుమారి కువైట్ నుంచి విమానంలో హైదరాబాద్ చేరుకుని శుక్రవారం అర్ధరాత్రికి సొంతూరు యల్లమిల్లిలోని ఇంటికి చేరుకుంది. దీంతో ఆమె కోసం ఎదురుచూసిన తల్లిదండ్రులు, పిల్లలు సంతోషం వ్యక్తం చేశారు. తమ తల్లిని సురక్షితంగా ఇంటికి చేర్చేందుకు చొరవ చూపిన మంత్రులు, జిల్లా అధికార యంత్రానికి గారా కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టభద్రుల ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

- ఓటర్లు 2,61,728
- వచ్చే నెల 9వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ
- కొత్తగా ఓటు నమోదుకు అవకాశం
- వచ్చే నెల 30న తుది జాబితా ప్రచురణ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను శనివారం ప్రచురించారు. తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఓటునమోదు అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రచురించారు. ఇప్పటివరకు 2,61,728 దరఖాస్తులు రాగా వాటిని జాబితాలో నమోదు చేశారు. దీనిలో పురుషులు 1,54,769మంది, మహిళలు 1,06,922 మంది ఉన్నారు. జిల్లాల వారిగా పరిశీలిస్తే కాకినాడ జిల్లాలో 55958, తూర్పుగోదావరి జిల్లాలో 51624, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 53726, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3336, ఏలూరు జిల్లాలో 36268, పశ్చిమగోదావరి జిల్లాలో 60816 మందిఓటర్లుగా నమోదయ్యాయి. ఈజాబితాను ఆరు జిల్లాల్లో ఉన్న కలెక్టరేట్లు, ఆర్డీవో కార్యాలయాలు, సబ్‌కలెక్టర్ కార్యాలయాలు, తహసీల్దార్ల కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు, ప్రదర్శిస్తున్నారు. ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వచ్చే నెల 9వ తేదీ వరకు తెలపవచ్చును. అలాగే వచ్చేనెల 9వరకు కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు చేయవచ్చును. వచ్చేనెల 30వ తేదీన తుది జాబితా ప్రచురిస్తారు. ఇతర వివరాలకు టోల్‌ఫ్రీ నెంబరుకు 1950 సంప్రదించాలి.

జొన్నాడ ఇసుక ర్యాంపులో సినిమా షూటింగ్



హీరో శ్రీనివాస్‌ను కలిసిన అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ఆలమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ ఇసుక ర్యాంపులో బెల్లంకొండ సురేష్ తనయుడుశ్రీనివాస్ హీరోగా నటిస్తున్న చిత్రానికి సంబంధించి చిత్రీకరణ జరిగింది. ఇసుకర్యాంపులో శనివారం సాయంత్రం జరిగిన షూటింగ్‌లో హీరో బెల్లంకొండ శ్రీనివాస్ తో పాటు చిత్ర యూనిట్ పాల్గొంది. ఈసందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేసి హీరో శ్రీనివాస్‌తో కొద్దిసేపు ముచ్చటించారు. హీరోగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే ఆయనను అభినందించారు.

సత్యదేవుని సన్నిధిలో లక్ష్మణ్ పూజలు



అన్నవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడిని శనివారం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కోవ లక్ష్మణ్ కుటుంబసభ్యులతో దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు ముందడుగు

ఒడిస్సా టూ తెలంగాణ వయా ఆంధ్రప్రదేశ్ లైన్

భూ సేకరణ సర్వే టెండర్లకు ఆహ్వానం


173.61 కిలోమీటర్లకు రూ.3,592 కోట్ల అంచనా వ్యయం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాండురంగాపురం రైల్వేలైన్, డివిజను కేంద్రమైన చింతూరు

చింతూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా జునాఘర్ నుంచి తెలంగాణ రాష్ట్రం భద్రాద్రికొత్తగూడెం జిల్లా పాండురంగాపురం వరకు కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. మన రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజను మీదుగా సాగే ఈ లైన్ ప్రధానమంత్రి గతిశెట్టి మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ఐదేళ్లలో పూర్తి చేయాలన్న తలంపుతో కేంద్రం చర్యలు వేగవంతం చేసింది. 173.6 కిలోమీటర్ల మేర సాగనున్న బ్రాడ్‌గేజ్ రైల్వేలైన్ ఏర్పాటుకు కేంద్రం ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ జారి చేసింది. అంచనా వ్యయంగా రూ.3,592 కోట్లుగా నిర్ధారించారు. ఆగస్టు 10న కేంద్ర కేబినెట్ ఆమోదం కూడా పొందింది. మూడు రాష్ట్రాలను కలిపే ఈ లైన్ నిర్మాణాన్ని రైల్వే శాఖ ప్రత్యేక ప్రాజెక్టుగా పరిగణించింది. వెను వెంటనే భూసేకరణ సర్వేకోసం ఓ ప్రత్యే క నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఒడి స్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో భూ సేకరణ సర్వే పనుల నిమిత్తం ఈనెల 20 నుంచి డిసెంబరు 4 వరకు దరఖాస్తుల గడువుగా పేర్కొంది. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే 2008 రైల్వే భూ సేకరణ చట్టం అనుసరించి భూములు సేకరించనున్నారు. ఆమేరకు అల్లూరి సీతారామ రాజుజిల్లా చింతూరు డివిజన్ పరిధిలో 85.5 కిలోమీటర్లు, ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లాలో 68.3కిలోమీటర్లు, తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 19.7 కిలోమీటర్ల మేర ఈ కొత్త లైన్ సాగనుంది. దీంతో మన రాష్ట్రంతో పాటు చత్తీస్‌గడ్, ఒడిస్సా, తెలంగాణ ప్రజలకు ప్రయాణ, రవాణ సౌకర్యం మరింత సులభతరంకానుంది. అదేదశలో విద్యా, వ్యాపార, పర్యాటక, ఆరోగ్య సంరక్షణలతోపాటు బహుళ వ్యాపారరంగాలు అభివృద్ధి అయ్యే అవకాశం ఉంది. ఇక చింతూరు డివిజన్ విషయానికొస్తే చింతూరు మండలంలోని సింగన్నగూడెం, కూనవరం మండలంలోని కూటూరుగట్టు, పలూరు మీదుగా ఎటపాక మండలం నందిగామ చేరుకుంటుంది. అనంతరం తెలంగాణలోని భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రా చలం మీదుగా పాండురంగాపురం చేరుకోనుంది.

సామర్లకోట-వేమగిరి కెనాల్ రోడ్డుకు మహర్దశ



వేమగిరి-సామర్లకోట కెనాల్‌రోడ్డు ద్వారపూడి-అనపర్తి మధ్య రోడ్డు (ఊహాచిత్రం)

రాష్ట్ర హైవేగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం

అభివృద్ధికి సంకేతాలు... 62 కిలోమీటర్ల మేర అభివృద్ధి

నాలుగు నియోజకవర్గాలతో పెనవేసుకున్న రహదారి

నెరవేరనున్న దశాబ్దాల కల

అనపర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న వేమగిరి సామర్లకోట రహదారికి మహర్దశ పట్టనుంది. వేమగిరి నుంచి సామర్లకోట వరకు నాలుగు నియోజకవర్గాలను కలుపుతూ 62 కిలో మీటర్లమేర ఉన్న ఈ రహదారి గత పది పదిహేను సంవత్సరాలుగా దుర్భరంగా మారి కనీసం ద్విచక్ర వాహనంతో కూడా ప్రయాణం చేయలేనిస్థితికి చేరుకుంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ రోడ్డు అభివృద్ధి మాత్రం అందని ద్రాక్షగా మారింది. ఈరోడ్డు పరిధిలో నాలుగు నియోజక వర్గాలు ఉన్నప్పటికీ అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఒక్కరే ఈ రోడ్డు అభివృద్ధి కోసం నాటి నుంచి నేటి వరకు కృషిచేస్తూ వస్తున్నారు. చివరకు ఆయన కష్టం ఫలించడంతో కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్డును రాష్ట్ర హైవేగా మార్పుచేస్తూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతులు మంజూరు చేసింది. ఈ రోడ్డును రాష్ట్ర హైవేగా మార్పు చేయడంతో కాకినాడ పోర్టుకు మూడో ప్రత్యామ్నా య మార్గం ఏర్పడినట్లయింది. వేమగిరి నేషనల్ హైవే 16నుంచి సామర్లకోట నేషనల్ హైవే 216కు అనుసంధానం చేస్తూ ఈ రహదారి నిర్మాణం కానుంది. దీంతో కాకినాడ పోర్టుకు మరో దగ్గర దారి ఏర్పాటు కానుంది. ఇప్పటివరకు రోడ్లు భవనాల శాఖ ఆధీనంలో ఉన్న ఈ రోడ్డును స్టేట్ నేషనల్ హైవేగా మార్పుచేయడంతో రహదారి నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు మంజూరు కానున్నాయి. ఇప్పటికే ఈ రహదారి విస్తరణ పనులకు గాను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మూడు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రహదారి విస్తరణకు పథక రచన చేయడమే కాకుం డా 235 కోట్ల ప్రపంచ బ్యాంక్ నిధులను కూడా సమకూర్చి ట్రాన్స్ స్ట్రాయ్ కంపెనీ ద్వారా పనులను చేపట్టింది. అని వార్య కారణాలవల్ల ట్రాన్స్ స్ట్రాయ్ పూర్తిగా పనులు చేయకుండానే వెను దిరిగింది. 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చేసరికి అభివృద్ధి పనులు అస్తవ్యస్థంగా ఉండటం రోడ్డుపై పెద్ద పెద్ద కుంతలు ఏర్పడి అనేక ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సుమారు 9కోట్ల నిధులతో ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. అదే విధంగా అసంపూర్తిగా ఉన్న కల్వర్టులను పూర్తి చేసేందుకు మరో రెండున్నర కోట్లతో నిర్మాణాలు చేయించారు. ఈ రోడ్డు అభివృద్ధికి ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో అధికార మార్పు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి వరకు ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నాయకుడు డాక్టర్ సత్తి సూర్య నారాయణరెడ్డి రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ పార్టీ శ్రేణులతో కలిసి సతీసమే తంగా పది కిలో మీటర్ల మేర పాదయాత్ర కూడా నిర్వహించారు. చివరకు ఆయన 2019లో ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో ఈ రోడ్డుకు మోక్షం లభిస్తుందని ఆశించిన ప్రజలకు ఐదేళ్లపాటు ఆశా భంగమే కలిగింది. చివరకు వైసీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంలో కూడా విఫలం కావడం ఆయన 2024 ఎన్నికలలో ఓట మికి కారణంగా నిలిచింది. వైసీపీ అధికారంలో ఉన్న తరుణంలో ప్రతిపక్ష నేతగా ఉన్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాత్రం రోడ్డు అభివృద్ధిపై నిత్యం పోరాటం చేస్తూనే ఉండేవారు. చివరకు మరమ్మ తులైనా చేయించాలని డిమాండ్ చేస్తూ అనేక పర్యాయాలు నిరశన కార్యక్రమాలు నిర్వహించారు. చివరకు ఈ ఉద్యమంపైనా పోలీసులు కేసు నమోదు చేసిన సందర్భం ఉంది. 2024 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా కెనాల్‌రోడ్డు అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇస్తూ రంగంలోకి దిగి ఇద్దరూ విజయం సాధించారు. దీంతో రోడ్డు అభివృద్ధిపై ఇరువురు నేతలు దృష్టిపెట్టారు. అన్ని టికన్నా ముందుగా రహదారి అభివృద్ధికి రోడ్డుస్థాయి పెంపు ఎంతైనా అవసరమని గుర్తించి ఈ 62 కిలో మీటర్ల మేర కెనాల్ రోడ్డును రెండు జాతీయ రహదారులకు అనుస ంధానం చేస్తూ రాష్ట్ర హైవేగా మార్పు చేయాలని ముఖ్య మంత్రి చంద్రబాబును కోరారు. దీంతో ముఖ్యమంత్రి జూలై నెలలో కెనాల్ రోడ్డును రాష్ట్ర హైవేగా మార్పుచేయాలని కోరుతూ కేంద్రఉపరితల, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కారీకి లేఖను రాశారు. ఈలేఖ ప్రాధాన్యతను గుర్తించిన కేంద్రమంత్రి ఈ రోడ్డును స్టేట్ హైవేగా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో రోడ్డు అభివృద్ధికి సుగమమైంది.

రోడ్డును అభివృద్ధి చేస్తే రవాణా, టూరిజం అభివృద్ధి

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



ప్రస్తుతం 30అడుగుల వెడల్పు ఉన్న ఈ రహదారిని కేంద్ర ప్రభుత్వం స్టేట్‌హైవేగా మార్పుచేస్తూ ఉత్తర్వులు జారీచేయడం ఆనందం ఉంది. రోడ్డు అభివృద్ధికి మార్గం సుగమమైంది. ఎన్నో సందర్భాలలో ఈ రోడ్డుపై జరుగుతున్న అనేక ప్రమాదాలను చూసి మనసు చలించి పోయేది. ఈ రోడ్డును అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముం దుకు సాగుతున్నాను. ప్రస్తుతం ఉన్న రోడ్డును అభివృద్ధిచేయడం, నాలుగులైన్లరోడ్డుగా అభివృద్ధి చేయడం వంటి మూడు ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి అందించాం. ఈ రోడ్డు అభివృద్ధి కోసం నాతోపాటు అనేక మంది పార్టీ శ్రేణులు అనేక పోరాటాలు చేశారు. ఇది అందరి విజయంగా భావిస్తున్నాను. త్వరితగతిన రోడ్డుకు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తాను.

కెనాల్ రోడ్డు పనులకు ముందడుగు

మండపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడితూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ప్రస్తుతం మూడుజిల్లాలకు సంబంధించిన వేమగిరి, సామర్లకోట మధ్యవున్న కెనాల్‌రోడ్డుకు ఎట్ట కేలకు మోక్షం కలగనుంది. వేమగిరి, కడియం, ద్వారపూడి అనపర్తి మీదుగా వున్న కెరాల్‌రోడ్డును కేంద్రప్రభుత్వం స్టేట్‌హైవేగా గుర్తించింది. ఈమే రకు ప్రభుత్వం శుక్రవారం అనుమతులు జారీ చేసిందని అధికారులు వెల్లడించారు. ఈ రహదారి పునఃనిర్మాణానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కానున్నాయి. ఈ కెనాల్ రోడ్డు వెంబడి సుమారు 60గ్రామాల వరకు ఉన్నాయి. ఈరోడ్డుకు సంబంధించి ఉమ్మడిజిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరంరూరల్, మండపేట, అనపర్తి, పెద్దాపురం, రామచంద్రపురం, యానాం ప్రాంత ప్రజలకు రోడ్డు ఎంతో ఉపయోగపడుతుంది. రాజమహేంద్రవరం నుంచి సామర్లకోట మీదుగా కాకినాడకు నిత్యం వందలాది వాహనాలు వెళ్తంటాయి. వేమగిరి నుంచి సామర్లకోట మధ్యవున్న కెనాల్ రోడ్డు 62 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈరోడ్డును స్టేట్‌హైవేగా మార్చుతూ కేంద్ర ఉపరితల రవాణాశాఖనుంచి ఏపీ ప్రభుత్వానికి అనుమతులు ఇచ్చింది. కెనాల్ వెంట రోడ్డుపక్క వున్న ఆక్రమణలు తొలగించటంతోపాటు రోడ్డువెడల్పు పనులు చేపట్టాలి.

గోకవరం ప్రభుత్వాసుపత్రిలో

బాలింత మృతి

● బిడ్డకు జన్మనిచ్చి వెంటనే మృతి



అంబులెన్స్‌లో వెంకటలక్ష్మి మృతదేహం

గోకవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్లిన నిండు గర్భిణి శస్త్ర చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గోక వరం ప్రభుత్వాసుపత్రిలో శనివారం చోటు చేసు కుంది. వైద్యుల నిర్లక్ష్యమో, జరిగిన తప్పిదమో తెలియదుగాని ఆ గర్భిణి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చి ఈ లోకాన్ని విడిచింది. వివరాల్లోకి వెళితే.. రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రా మానికి చెందిన బీరబోయిన వెంకటలక్ష్మి (34) అటవీశాఖలో గోకవరం రాణాదారుగా పనిచేస్తో ంది. ఆమె భర్త దుర్గాప్రసాద్ ఫారెస్ట్ సెక్షన్ అధి కారిగా పనిచేస్తున్నారు. వెంకటలక్ష్మి గర్భిణి అని తెలిసినప్పటి నుంచి రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మందులు వాడుతున్నారు. ప్రసవ సమయం దగ్గర పడడంతో ఈనెల 22న రాత్రి గోకవరం ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. శనివారం ఆమెను ప్రసవం కోసం ఆసుపత్రి వైద్యులు ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు. శస్త్రచికిత్స చేస్తుండగా వెంకటలక్ష్మికి మగబిడ్డకు జన్మనిచ్చి డెలివరీ టేబుల్‌పైనే మృతి చెందింది. అప్పటివరకు ఎంతో ఆరోగ్యంగా ఉన్న గర్భిణి వెంకటలక్ష్మి అకాలంగా మృతి చెందడంతో ఆమె బంధువులు, తోటి ఉద్యోగులు విస్మయానికి గురయ్యారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, సహచర ఉద్యోగులు ఆసుపత్రికి చేరు కొని వెంకటలక్ష్మి మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

● లక్షలో ఒకరికి ఇలా జరుగుతుంది

గర్భిణులు ప్రసవం కోసం శస్త్రచికిత్స పొందుతూ మృతి చెందడం లక్షలో ఒకరికి జరుగుతుందని స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యురాలు వనజాకుమారి తెలిపారు. వెంకటలక్ష్మి మృతికి కారణా లను ఆమె నుంచి తెలుసుకునే ప్రయత్నం చేయగా ఉమ్మనీరు రక్తనాళాలలోకి ప్రవేశించడంవల్ల గుండెపోటుకు గురై మృతి చెందినట్టు చెప్పారు. నార్మల్ డెలివరీ సమయంలో కూడా ఇటువంటి ఘటనలు జరుగుతాయన్నారు. వెంకటలక్ష్మికి పుట్టిన మగబిడ్డ 3కిలోల బరువుతో ఆరోగ్యంగా ఉన్నాడని ఆమె పేర్కొన్నారు.



వెంకటలక్ష్మి జన్మనిచ్చిన మగ బిడ్డ

మృతి చెందిన గర్భిణి వెంకటలక్ష్మి

విద్యార్థినులపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

● దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు ● పోలీసుల అదుపులో నిందితుడు

వారంతా నిరుపేదల పిల్లలు. కూలీనాలీ చేసుకునే ఆ తల్లిదండ్రులు, తమ పిల్లలు తమలా కష్టపడకూడదనే సంకల్పంతో కార్పొరేట్ స్కూళ్లకు పంపించే స్తోమత లేక ప్రభుత్వం నడుపుతున్న హైస్కూల్‌కి పంపుతున్నారు. అక్కడ తం డ్రి స్థానంలో ఉండి చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినులపై ఎక్కడపడితే అక్కడ చేతులు వేసి నిమురుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతుండడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఆ విద్యార్థినులు అటు ఇంటిలో చెప్పలేక ఇటు హెడ్‌మాస్టర్‌కు చెప్పలేక కుమిలిపోయిన పిల్లలకు శనివారం పాఠశాలలో మహిళా పోలీసులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఈ కీచక ఉపాధ్యాయుడి లీలలు బట్టబయలయ్యాయి. వివరాల్లోకి వెళితే...


కాకినాడ క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాధపురం ఘాటీ సెంటర్‌లోని బాలయోగి మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో 6,7, 10వ తరగతి క్లాస్‌లకు గణితశాస్త్రం బోధించే శ్రీనివాసరావు హోంవర్క్ చేయని, అలాగే స్కూల్ కి ఆబ్సెంట్ అయిన విద్యార్థినుల ఒంటిపై చేతులువేసి పిచ్చిపిచ్చి చేష్టలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విధంగా గత రెండు నెలలుగా జరుగుతుంది. ఓపిక, సహనంతో తమ విద్యకు ఆటంకం కలుగుతుందేమోనన్న సందేహంతో విద్యార్థినులు తమలో తాము మద నపడ్డారే తప్ప ఎవరికీ చెప్పుకోలేకపోయారు. టీచర్ శ్రీనివాసరావు వేధింపులు మరింత అధికంకావడంతో శుక్రవారం వారి తల్లి దండ్రులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో శని వారం గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై విద్యార్థినులకు వన్‌టౌన్ మహిళా పోలీసులు అవగాహనా సదస్సు నిర్వహిస్తున్న తరుణంలో వారిలో కొంత మంది విద్యార్థినులు లేచి మ్యాథ్స్ టీచర్ తమపై రోజు చేస్తున్న లైంగిక వేధింపులను మహిళా పోలీసులకు వివరించారు. విద్యార్థినుల తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుకు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు సంఘటనా స్థలికి చేరుకుని శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. బాధిత తల్లిదండ్రులు ఆ కీచక ఉపాధ్యాయుడుని పోలీస్‌స్టేషన్‌కి తీసుకువెళ్లవద్దని తమకు అప్పగించాలని అతడి సంగతి తాము చూసుకుంటామని పోలీసులను ప్రాధేయపడ్డారు. అనంతరం ఆందోళనకారులు పోలీస్ జీపుకు అడ్డుగా బైఠాయించారు. దాంతో సీఐ నాగదుర్గారావు బాధితులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. నిందితుడు శ్రీనివాసరావును పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కీచక ఉపాధ్యాయుడు 2016 నుంచి ఆ పాఠశాలలో పనిచేస్తున్నాడు. అప్పటి నుంచి అతడు ఎన్ని అఘాయిత్యాలకు పాల్పడ్డాడో అనే దానిపై కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడిని పోలీస్ వాహనం ఎక్కిస్తున్న పోలీసులు, టీచర్ శ్రీనివాసరావు

విచారణ నిర్వహిస్తాం: డీఈవో

కాకినాడ రూరల్: కాకినాడ జగన్నాధపురంలోని జీఎంసీ బాలయోగి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థినులపై గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థినుల తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాలవద్ద శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, డీఈవో పి.రమేష్, డీవైఈవో వెంకటేశ్వరరావు, ఎంఈవో రవి హుటాహుటిన ఆ పాఠశాలకు వెళ్లారు. అప్పటికే పోలీసులు సంబంధిత ఉపాధ్యాయుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యార్థులందరినీ పాఠశాల నుంచి పంపించేశారు. అధికారులు ఆ పాఠశాలలోని మిగతా ఉపాధ్యాయులను విచారించి సమాచారం తెలుసుకున్నారు. పోలీసుల విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని డీఈవో రమేష్ తెలిపారు.



చింతపల్లి లోవరాజు

రోడ్డు ప్రమాదంలో ఐటీబీపీఎఫ్ కానిస్టేబుల్ లోవరాజు మృతి

నేడు పేరూరులో అంత్యక్రియలు

అమలాపురంరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమలాపురం రూరల్ మండలం పేరూరు చింతపల్లివారిపాలేనికి చెందిన చింతపల్లి లోవరాజు (32) ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్‌ఫోర్స్ (ఐటీబీపీఎఫ్)లో పనిచేస్తున్నారు. విశాఖపట్నం కేంద్రంగా పనిచేసే ఈయన ఇటీవల అసోం బదిలీ కావడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 22న అసోం నుంచి కుటుంబాన్ని చూసేందుకు విశాఖపట్నం వచ్చారు. ఆనందపురం-పెందుర్తి సర్వీసు రోడ్డులో బైక్‌పై లోవరాజు ప్రయాణిస్తుండగా వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోవరాజు చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతదేహాన్ని పేరూరు తరలించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. లోవరాజుకు భార్య, ముగ్గురు పిల్లలతో పాటు తల్లి, సోదరుడు ఉన్నారు.



దేవరపల్లిలో నిందితులతో వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాయక్

40.550కిలోల గంజాయి స్వాధీనం

● నలుగురు వ్యక్తుల అరెస్టు

దేవరపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిళ్లపై వెళుతు న్న నలుగురు వ్యక్తులను అరెస్టుచేసి వారి నుంచి 40.550 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బీఎన్ నాయక్ తెలిపారు. దేవరపల్లిలోని సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన వివరాలను వెల్లడించారు. ఎస్ఐ సుబ్రహ్మణ్యంకు అందిన సమాచారం మేరకు శనివారం దేవరపల్లి డైమండ్ జంక్షన్‌వద్ద వాహనాలను తనిఖీ నిర్వహిస్తుండగా ఈ గంజాయి నిందితులు పట్టుబ డ్డారని తెలిపారు. విశాఖజిల్లా పాడేరు, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా, తదితర ప్రాంతాల నుంచి కేరళ రాష్ట్రానికి చెందిన నలుగురు యువకులు అమల్‌కృష్ణ, మహమ్మద్ సాహల్, సాహల్ మొన్, అభినవ్ పునతిల్ ముత్తల్‌లు నాలుగు గంజాయి మూటలతో రెండు మోటార్ సైకిళ్లపై తమిళనాడు రాష్ట్రం, కొయంబత్తూర్‌కు తరలిస్తుండగా వారివద్ద నుంచి మోటార్‌సైకిళ్లు, 40.550 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



పట్టుబడ్డ గంజాయి మూటలు

ఓఎన్జీసీ వెల్‌సైట్‌లో వైట్ ఆయిల్ చోరీ

● ముగ్గురు నిందితులు అరెస్టు

అమలాపురం టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏ మాత్రం అదుపు తప్పినా ప్రమాదకరమని తెలిసినప్పటికీ పాత నేరస్తుడు అదే పంథాను కొనసాగిస్తూ ఓఎన్జీసీ బావి వద్ద మరోసారి వైటాయిల్ దొంగిలిస్తూ ఉప్పలగుప్తం పోలీసులకు ముఠాతో సహా పట్టుబడ్డాడు. ఈ కేసుకు సంబంధించి అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ శనివారం స్థానిక తాలూకా సీఐ కార్యాలయంవద్ద వివరాలను వెల్లడించారు. ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామంలోని రావూరి కాల్వగట్టు సమీపంలో ఉన్న ఓఎన్జీసీ జీఎం-14 వెల్‌సైట్‌లో గత ఐదు నెలలుగా వైటాయిల్‌ను చోరీ చేస్తున్న ముఠాను రూరల్ సీఐ పి.వీరబాబు, ఉప్పలగుప్తం సీహెచ్ రాజేష్‌ల బృందం చాకచక్యంగా పట్టుకున్నారని తెలిపారు. పశ్చిమగోదావరిజిల్లా యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన గుడాల రమేష్ (37) ఇదే తరహాలో నేరాలుచేస్తూ పలు పర్యాయాలు పోలీసులకు చిక్కాడు. అతనికి తోడుగా పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామానికి చెందిన జోగి ధనరాజు (44)తో కలిసి చల్లపల్లి ఓఎన్జీసీ సైట్‌లో వైటాయిల్ వచ్చే గ్యాస్ ప్రెజర్‌కు వెల్‌నాబ్‌ను అమర్చి మరో పైపులైను బిగించి వైటాయిల్‌ను చోరీ చేస్తున్నారు. గత ఐదు నెలలుగా ఇదే తరహాలో వైటాయిల్‌ను చోరీ చేస్తున్నారు. గత నెల 24న ఈ తరహాలో వైటాయిల్ దొంగిలిస్తుండగా ఓఎన్జీసీ వెల్ లీకై పెద్దగా శబ్దం రావడంతో గమనించి అక్కడి నుంచి రమేష్, ధనరాజులు పరారయ్యారు. దీనిపై ఓఎన్జీసీ రెసిడెంట్ ఇంజనీర్ చొప్పర రామకృష్ణారావు ఉప్పలగుప్తం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ రాజేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ దశలో ఉండగానే మళ్లీ వీరు వైటాయిల్ చోరీకి ప్రయత్నించారు. చోరీచేసిన వైటాయిల్‌ను ప్లాస్టిక్ టిన్నుల్లో నింపి రహస్యంగా అంబాజీపేట మండలం కె.పెదపూడిలో ఉన్న పంజా నూకరాజుకు లీటరు రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. నూకరాజు ఆ వైటాయిల్‌ను సమీపంలోని చేపల చెరువులకు వాడే ఇంజన్లకు లీటరు రూ.80 చొప్పున విక్రయిస్తున్నాడు. ఈ నెల 22న మండల పరిధిలోని గోపవరంలో వాహనాలు చెక్‌చేసే సమయంలో రమేష్, ధనరాజు, నూకరాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో వారిని విచారించి అరెస్టు చేసి వారి వద్ద నుంచి మోటారుసైకిల్‌తోపాటు చోరీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టుచేసిన సీఐ వీరబాబు, ఎస్ఐ రాజేష్‌లను ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. ప్రమాద భరితమైన ఇటువంటి పనులు ఎవరూ చేయరాదని, వీటికి అడ్డుకట్ట వేసేందుకు ఓఎన్జీసీ బావుల వద్ద పోలీసుల నైట్‌బీట్‌లు పెంచుతామన్నారు. అదేవిధంగా ఓఎన్జీసీ సిబ్బంది కూడా ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు.



అమలాపురం తాలూకా సీఐ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

పిఠాపురంలో బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

పిఠాపురం, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్ బాల్ స్త్రీ, పురుషుల ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడ జిల్లా పిఠాపురంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి ఈపోటీలను వైద్యుడు కాశీ విశ్వనాథం, సీనియర్ క్రీడాకారులు ప్రారంభించారు. రెండ్రోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయి. పట్నాల అన్నేశ్వరరావు, రావుల వరహాలు మోమెరియల్ పేరుతో జరుగుతున్న ఈ పోటీల్లో జిల్లా నలమూలల నుంచి 12 పురుషులు, 8మంది స్త్రీ జట్లు తలపడనున్నాయి. విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. కార్యక్రమంలో కొత్తెం సుందర్ కుమార్, గండి కొండలరావు, వీఎస్ రెడ్డి, రామయ్య, అనుబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభిస్తున్న వైద్యుడు, క్రీడాకారులు

ఆర్‌టీసీ బస్సుల ఢీ: తృటిలో తప్పిన ప్రమాదం



కాకినాడ జీజీహెచ్ కూడలిలో రెండు బస్సులు ఢీ కొన్న దృశ్యం

కాకినాడ క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండు ఆర్‌టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీ కొన్న సంఘటన శనివారం కాకినాడలో జరిగింది. అయితే జనసాంద్రత తక్కువగా ఉన్న నేపథ్యంలో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. కాకినాడ జీజీహెచ్ ఎదురుగా ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహ కూడలిలో శనివారం ఉదయం రాజమహేంద్రవరం నుంచి కాకినాడకు ఆర్‌టీసీ హయ్యర్ బస్సు వస్తుంది. అదే సమయంలో కాకినాడ నుంచి అమలాపురంనకు ఆర్‌టీసీ బస్సు వెళుతోంది. ఆ సమయంలో హయ్యర్ బస్సు నడుపుతున్న చిన్ని వేగంగా నడుపుతూ ఆసుపత్రి వైపు టర్నింగ్ తీసుకుంటున్న అమలాపురం బస్సును ఢీ కొన్నాడు. దాంతో బస్సు ముందు భాగం దెబ్బతింది. అయితే రద్దీ ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు డ్రైవర్ చిన్ని పై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరిడమ్మకు పంచామృతాభిషేకం

పెద్దాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జన్మనక్షత్రం మఖను పురస్కరించుకుని శనివారం పంచామృతాభిషేకం నిర్వహించారు. వేదపండితులు ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు, అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

'సమగ్ర కులగణన చేపట్టాలి'



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ని కలిసిన బీసీ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ దుర్గా రమేష్

పిఠాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ పప్పు దుర్గా రమేష్, ఎమ్మెల్యేల బృందం ముఖ్యమంత్రి చంద్రబాబును, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించి, సంబంధిత వినతి పత్రానిన వారికిచ్చారు. దుర్గా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాస్త్రీయ పరంగా సమగ్ర కులగణన నిర్వహించాలని, రాష్ట్రంలో ఉన్న కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని కోరారు. చమురు సంస్థల ద్వారా నష్టపోతున్న తీర ప్రాంత మత్స్యకారులకు పరిహారం చెల్లించాలన్నారు. ఎమ్మెస్ఎన్ చారిటీస్ భూములు, అంతర్వేది ఆలయ ఆస్తులు కాపాడాలన్నారు. ఆయా సమస్యలపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ఏపీ బీసీ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మల్లాడి కృష్ణారావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

'మరిన్ని పదవులు చేపట్టాలి'

కాకినాడ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పదిమందికి ఉపయోగపడుతూ తెలుగుదేశం పార్టీలో అంచెలంచెలుగా ఎదిగిన కొల్లాబత్తుల మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ ఎంఎస్ మూర్తి పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్‌లో రైతుబజార్ రైతులు, వ్యాపారస్తులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కొల్లాబత్తుల అప్పారావును శాలువా, పూల దండలతో సత్కరించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ మూర్తి మాట్లాడుతూ అంకితభావంతో పని చేసిన అప్పారావుకు మరింత సేవ చేసే అవకాశం లభించిందన్నారు. వ్యాపారస్తులు డీబీ పుత్రరావు, వీరబాబు, పుల్ల రాంబాబు, సత్తిబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్

గొల్లప్రోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శనివారం రాజ్యాంగ, సాంఘిక శాస్త్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాక్ పోలింగ్ కార్యక్రమం నిర్వహించారు. 7వ తరగతి విద్యార్థులు పోలింగ్ సిబ్బందిగా వ్యవహరించగా, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు యామిని ప్రసాద్, సబిత ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. వారితో పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల్లో పీవో, ఏపీవో, ఓపీవో, పోలీసులు, మెడికల్, హెల్త్ డిపార్టుమెంట్లతో పోలింగ్ సరళి ఏ విధంగా జరుగుతుందో, ఫలితాలు ఏ విధంగా వెలువడతాయో విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ సూర్య ప్రకాష్ రెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

వాకతిప్పలో అన్నదానం

కొత్తపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకతిప్పలో శ్రీకృష్ణ ఆలయం మొదటి వార్షికోత్సవం పురస్కరించుకుని యాదవ సంక్షేమ సంఘం నాయకులు, మాజీ సర్పంచ్ పులగల అప్పలరాజు కుమారులు అన్నదానం నిర్వహించారు. సుమారు 5 వేల మంది పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

కార్తీక వన సమారాధన

తాళ్లరేవు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జి.వేమవరంలో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఉమామనోవికాసకేంద్రం ఆధ్వర్యంలో ధీరూబాయి అంబాని ఎర్లీవెంటర్ సెంటర్ దివ్యాంగులు, తల్లిదండ్రులు కార్తీక వనసమారాధన శనివారం నిర్వహించారు. దివ్యాంగులు ఉత్సాహంగా గడిపారు. సెంటర్ ఇన్‌చార్జ్ గోపాలరావు, స్టీఫెన్, ఫిజియోథెరపీ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ గ్రంథాలయం సంగతేంటి?

గొల్లప్రోలులో గ్రంథాలయం లేక ఇక్కట్లు

గ్రంథాలయ పన్ను మాత్రం వసూలు

తొమ్మిదేళ్లుగా ఇదే పరిస్థితి

విస్మరించిన పాలకులు

పట్టణ హోదా పొందింది. అన్ని ప్రాంతాల్లో రీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరితే ఉన్న గ్రంథాలయాన్ని మూసివేసి పాఠకులకు పత్రికలు, పుస్తకాలు అందుబాటులో లేకుండా చేశారు. తొమ్మిదేళ్లుగా ఇదే పరిస్థితి. గ్రంథాలయ పన్ను మాత్రం క్రమం తప్పకుండా వసూలు చేస్తున్నారు. దానిపై ఉన్న శ్రద్ధ లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లు ఏర్పాటుపై లేకపోవడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు.



గొల్లప్రోలులో గతంలో నగర పంచాయతీ గ్రంథాలయం నిర్వహించిన భవనం



గతంలో నగర పంచాయతీ గ్రంథాలయం ఉన్న భవనంలో ప్రస్తుతం అన్నక్యాంటీన్ నిర్మాణం

గొల్లప్రోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీగా ఉన్న గొల్లప్రోలు పట్టణ హోదా పొంది 13 ఏళ్లు కావస్తోంది. పంచాయతీ కంటే మెరుగైన సౌకర్యాలు వస్తాయనుకుంటే పన్నుల బాదుడు మినహా కలిగిన సదుపాయం ఒక్కటి కనబడటం లేదు. ఒకప్పుడు జిల్లాలో ఉత్తమైన లైబ్రరీగా గొల్లప్రోలు పూర్వ పంచాయతీ గ్రంథాలయానికి గుర్తింపు ఉండేది. ఇక్కడ అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉండేవి. ఎక్కడైనా పంచాయతీల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలనుకుంటే ఇక్కడకు వచ్చి పరిశీలన జరిపేవారు. అప్పట్లోనే గొల్లప్రోలు గ్రంథాలయంలో నిత్యం వచ్చే దినపత్రికలతో పాటు వార, మాసపత్రికలు, అన్నిరకాల కాంపిటేటివ్ బుక్స్‌ను ఇక్కడ ఉంచేవారు. ఏ పోటీ పరీక్షకు సన్నద్ధమయ్యే వారైనా ఈ లైబ్రరీకి వచ్చి పుస్తకాలను రిఫర్ చేసుకునేవారు. అదేవిధంగా నామమాత్రపు రుసుము చెల్లించి సభ్యత్వం పొందిన వారికి పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లే సౌలభ్యం ఉండేది. నాలుగు దశాబ్దాలు పాటు ఎంతోమందికి ఇది ఆసరాగా నిలిచింది. ఇక్కడ కాంపిటేటివ్ బుక్స్ చదివిన వారు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు.

లైబ్రరీ నిర్వహణపై అనాసక్తి

తొలుత గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలోనే ఉండే ఈ లైబ్రరీని పట్టణ హోదా పొందిన తర్వాత నగరపంచాయతీ కార్యాలయానికి చోటుసరిపోవడం లేదంటూ పూర్వ ఆంధ్రా బ్యాంకు ఎదురుగా మెయిన్‌రోడ్డులో గల భవనంలోకి మార్చు చేశారు. తదనంతరం నగరపంచాయతీ గ్రంథాలయం కొనసాగినా కొత్త పుస్తకాలు కొనుగోలు నిలిపివేశారు. తదనంతరం లైబ్రరీ నిర్వహణపై ఆసక్తి చూపడం మానివేశారు. ఇక్కడ ఉన్న కాంట్రాక్టు సిబ్బందిని ఆఫీసు అవసరాలకు వినియోగించుకుంటూ అప్పుడప్పుడు మాత్రమే లైబ్రరీ తెరిచేవారు. తొమ్మిదేళ్ల క్రితం భవనం శిథిలావస్థలో ఉన్నదన్న సాకుతో మొత్తం లైబ్రరీనే మూసివేసి అందులో పుస్తకాలను అక్కడే వదిలివేశారు. కాలక్రమంలో భవనం పూర్తిగా శిథిలమైందంటూ దానిని తొలగించి అన్నక్యాంటీన్ నిర్మాణానికి అప్పగించారు. ప్రస్తుతం అక్కడ భవన పనులు ఆరేళ్లుగా సాగుతూనే ఉన్నాయి.

కొత్తవి ఏర్పాటు చేస్తారనుకుంటే...

సాధారణంగా పట్టణాలు, నగరాల్లోని ప్రధానమైన ప్రాంతాల్లో ప్రజలకు అన్నిరకాల దినపత్రికలు, పుస్తకాలు, కాంపిటేటివ్ బుక్స్ అందుబాటులో ఉండే విధంగా రీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా గ్రామం నుంచి పట్టణంగా మారిన గొల్లప్రోలులోనూ కొత్తగా రీడింగ్ రూమ్‌లు ఏర్పాటవుతాయని ప్రజలు ఆశించారు. అందుకు భిన్నంగా ఉన్న లైబ్రరీని నగరపంచాయతీ అధికారులు మూసివేశారు. అందులో ఉన్న విలువయిన పుస్తకాలను చెదలు పట్టేలా చేశారు. గ్రంథాలయాన్ని తిరిగి తెరిపించాలని, పట్టణంలో కనీసం 3రీడింగ్ రూమ్‌లు కొత్తవి ఏర్పాటు చేయాలని, అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని పలుమార్లు పట్టణంలోని యువతీ, యువకులు, పాఠకులు నగరపంచాయతీ అధికారులకు విన్నవించారు. అయినా ఫలితం లేకపోయింది. నగరపంచాయతీ పాలకులు ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి

నగరపంచాయతీ గ్రంథాలయం ఏర్పాటుకు పూర్వ గొల్లప్రోలు పీహెచ్‌సీ భవనం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల భర్తీ ఎక్కువగా జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పట్టణంలో కనీసం 2 లేదా 3 ప్రాంతాల్లో గ్రంథాలయం కమ్ రీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసి పోటీపరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచాలనే డిమాండ్ ఉంది. ప్రస్తుతం జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్వహణలో ఉన్న శాఖా గ్రంథాలయం పట్టణ ప్రజల అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చలేకపోతున్నది. ప్రజాప్రతినిధులు, నగరపంచాయతీ అధికారులు స్పందించి గొల్లప్రోలు పట్టణంలో గతంలో ఉన్న నగరపంచాయతీ గ్రంథాలయాన్ని పునరుద్ధరించడంతో పాటు ప్రధానమైన ప్రాంతాల్లో రీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

గొల్లప్రోలు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలంలోని దుర్గాడలో విద్యుత్ సబ్‌స్టేషన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం ఆ గ్రామంలో డంపింగ్ యార్డు ప్రక్కనే ఉన్న స్థలంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అనువైన స్థలంలో ఈ నిర్మాణం చేపట్టాలని అధికారులు గ్రామ ప్రజాప్రతినిధులకు సూచించారు. ఏఈ రామచంద్రరావు, ఉప సర్పంచ్ పంపన రామచంద్రరావు, మారో సత్యనారాయణ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 23 మందికి జరిమానా

పిఠాపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీసులు గత 4 రోజులుగా డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపివారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. శనివారం కోర్టులో హాజరుపరచగా 23మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు వంతున రూ.2,30,000 జరిమానాను ఫస్ట్‌క్లాస్ ప్రిన్సిపల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ జడ్జి విజయ రామేశ్వరి విధిస్తూ తీర్పు చెప్పారు.

మోటర్‌సైకిల్ ఢీకొని మూడేళ్ల చిన్నారికి గాయాలు

కరప, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కరప మండలం గొర్రిపూడిలో మోటర్‌సైకిల్ ఢీకొని మూడేళ్ల చిన్నారి తీవ్ర గాయాలపాలయ్యింది. గ్రామానికి చెందిన పీరుగాని పుల్లారావు స్థానిక మార్కెట్‌సెంటర్‌లో చికెన్‌షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే అతడి మూడేళ్ల కుమార్తె వెంకటరమణశ్రీ చికెన్‌షాపు వద్దకు నడుచుకుంటూ వస్తుండగా మోటర్‌సైక్లిస్ట్ వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన చిన్నారిని చికిత్స నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ తోట సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి బయటపెట్టిన కొత్త స్కూటర్ చోరీ

కరప, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇంటి బయట పెట్టిన కొత్త స్కూటర్ చోరీకి గురికావడంపై కేసు నమోదు చేసినట్టు కరప పోలీసులు తెలిపారు. కరప మండలం పెదకొత్తూరు గ్రామానికి చెందిన గొల్లపల్లి సంజయ్‌కుమార్ పాలిటెక్నిక్ చదువుతున్నాడు. కాకినాడ షోరూంలో శుక్రవారం రాత్రి సుజుకి యాక్సిస్ 125 స్కూటర్‌ను కొనుగోలు చేసి పెదకొత్తూరులోని తన ఇంటి ముందు పార్క్ చేశాడు. శనివారం ఉదయం లేచిచూసేసరికి కొత్త బండి మాయం కావడంతో చుట్టుపక్కల విచారించాడు. ఫలితం లేకపోవడంతో కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సునీత చెప్పారు.

మద్యంతో వ్యక్తి అరెస్ట్

తాళ్లరేవు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యానాం మద్యాన్ని అక్రమంగా తరలించి గ్రామాల్లో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వర్ శనివారం అరెస్టు చేశారు. కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెనికి చెందిన పెసింగి వీరబాబు యానాం నుంచి మద్యాన్ని తరలించి గ్రామంలో విక్రయిస్తుండడంతో తాళ్లరేవు ఎక్సైజ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. 150 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని పెసింగి వీరబాబును రిమాండ్‌కు తరలించారు. దాడిలో ఎస్ఐ వై. నాగేంద్రకృష్ణ, హెచ్‌సీ వెంకటేశ్వరరావు ఉన్నారు.

మహాన్నదానం

సామర్లకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో పురాతన ప్రసిద్ధిపొందిన పాండురంగస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. సత్యనారాయణపురానికి చెందిన నాగం వెంకన్న తదితర కుటుంబసభ్యులు పూజల్లో ఆశీనులయ్యారు. వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన మహాన్నదానాన్ని ప్రారంభించారు. సుమారు 3 వేలమంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఇండస్ట్రీయల్ ఎస్టేట్ సమీపాన సత్తెమ్మ ఆలయం వద్ద గోవిందు ఆధ్వర్యంలో మహాన్నదానాన్ని నిర్వహించగా 2వేలమంది పాల్గొన్నారు.

రైతులకు అన్నదానం

పిఠాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు డొక్కా సీతమ్మ స్ఫూర్తితో రైతులకు ప్రతీ వారం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నామని సాయిప్రియా సేవా సమితి అధ్యక్షుడు, జిల్లా జనసేన కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తెలిపారు. శనివారం పిఠాపురం పశువుల సంత వద్ద, ఆసుపత్రికి వచ్చే రోగులకు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమం ఈ వారం కూడా నిర్వహించారు. 740 మంది అన్నదానంలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో అల్లం కిషోర్, పోతుల రాజు, కీర్తి చిన్న, జ్యోతుల సీతారాంబాబు, నాని, విప్పర్తి శ్రీను పాల్గొన్నారు.

మహారాష్ట్రలో బీజేపీ విజయం పట్ల హర్షం



పిఠాపురంలో జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డికి స్వీట్లు తినిపిస్తున్న బీజేపీ నాయకులు

సర్పవరం జంక్షన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలో కూటమి అఖండ మెజారిటీతో అధికారంలోకి రావడం పట్ల కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ బలం గత ఎన్నికల్లో కంటే అత్యధికంగా పెరిగిందన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్రంలోని బీజేపీ కూటమి దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపిందన్నారు. పాలనలో అనేక సంస్కరణలతో అన్ని వర్గాలకు కేంద్రం మేలు చేసిందన్నారు. బీజేపీపై మహారాష్ట్ర ప్రజలు సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారని, బీజేపీకి ఘన విజయం కట్టబెట్టిన మహారాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జార్ఖండ్‌లో బీజేపీ అధికారంలోకి రాకపోయినప్పటికీ అధిక సీట్లను కైవసం చేసుకోవడం జరిగిందన్నారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయం ఆనందంగా ఉందన్నారు.

పిఠాపురం: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు పిఠాపురంలో సంబరాలు నిర్వహించారు. పిఠాపురం జనసేన కార్యాలయంలో స్వీట్లు పంచారు. పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించిన అన్ని నియోజకవర్గాల్లో మహాయుతి విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌కు స్వీట్లు తినిపించారు. మోదీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గండి కొండలరావు, దాట్ల సూర్యనారాయణ రాజు, పిఠాపురం, గొల్లప్రోలు టౌన్ అధ్యక్షులు పసుపులేటి సత్యనారాయణ, చిట్టా మధు, వాసంశెట్టి శ్రీనివాస్, తోట ఏడుకొండలు, బుర్రి మురళీధర రావు, కొమ్మిరెడ్డి వీరభద్రరావు, అడబాల మోహనరావు, కర్రి అన్నవరం తదితరులు ఉన్నారు.

పెద్దాపురం: మహారాష్ట్రలో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ హర్షం వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి 225 సీట్లు కైవసం చేసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. దేశంలో అవినీతి రహిత పాలన అందిస్తూ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న బీజేపీ ప్రతీ రాష్ట్రంలో విజయం సాధించడం తథ్యమని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి : కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇంటి, కుళాయి పన్నుల వసూళ్లపై రెవెన్యూ విభాగం ప్రత్యేక దృష్టి సారించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 శాతం మేర ఉన్న పన్నుల బకాయి భారాన్ని తగ్గించాల్సిన బాధ్యత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బందిపై ఉందన్నారు. పన్నులు చెల్లించని వారికి తక్షణమే నోటీసులు అందించి చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి కుళాయి పన్ను బకాయిలు రూ.16 కోట్లు, ఇంటి పన్నుల బకాయిలు రూ.25కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరితగతిన వసూలు చేసి నూరుశాతం వసూలు చూపించాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పన్నుల వసూళ్లపై వారంవారం సమీక్ష నిర్వహిస్తానని మెరుగుదల కనిపించాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ మనోహర్, రెవెన్యూ ఆఫీసర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తదితర సిబ్బంది ఉన్నారు.

'తల్లిదండ్రుల పాత్ర కీలకం'

పిఠాపురం, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమని మోటివేషన్ స్పీకర్ మాకేన సతీష్ తెలిపారు. పిఠాపురం ఆదిత్య విద్యాసంస్థలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ పిల్లను తీర్చిదిద్దే విధానంపై అవగాహన కల్పించారు. సమాజంలో పిల్లల్ని తీర్చిదిద్దే విధానంపై నవ సమాజంలో తల్లిదండ్రుల పాత్ర, విశిష్టతను వివరించారు. విద్యార్థి భవిష్యత్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పరస్పర సహకారంతో ఉన్నతంగా తీర్చిదిద్దవచ్చన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల సరైన విధానంలో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఆదిత్య పాఠశాలల డైరెక్టర్ శృతిరెడ్డి, సతీష్ రెడ్డి, ప్రిన్సిపాల్ విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుకు ప్రాధాన్యం

ఎలక్షన్ కమిషన్ జాయింట్ సీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న సీఈవో

సర్పవరం జంక్షన్, నవంబరు 23: ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యం ఉందని, అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటు నమోదు చేసుకుని ఓటనే వజ్రాయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎలక్షన్ కమిషన్ జాయింట్ సీఈవో, జిల్లా ప్రత్యేకాధికారి ఏ.వెంకటేశ్వరరావు కోరారు. శనివారం కాకినాడ రూరల్ తిమ్మాపురం రాజీవ్‌గాంధీ ఎంబీఏ కాలేజీలో స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆఫ్ ఎలక్షన్ రోల్స్- 2025లో భాగంగా ఈనెల 23-24 తేదీల్లో జరిగే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆధ్యక్షతన జరిగిన స్వీప్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమం నిరంతరం జరిగే ప్రక్రియ అన్నారు. మరణించిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. ప్రతీ పౌరుడు బాధ్యతగా ఓటు నమోదు చేసుకుని, ఓటును వినియోగించుకోవాలని అప్పుడే బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఉంటుందన్నారు. తహశీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, రాజీవ్‌గాంధీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ వెంకటరావు పాల్గొన్నారు.

శృంగారవల్లభస్వామి ఆలయంలో రద్దీ



స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

పెద్దాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి వారిని భక్తులు శనివారం దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,61,570 అన్నదాన విరాళాలు రూ.72,748 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.6,400, తులాభారం, కానుకల ద్వారా రూ.300 లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.45,180 వెరసి రూ.3,86,198 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు 8వేల మంది స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో విశేష కార్తీక పూజలు

సామర్లకోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మహాపర్వదినాలు ఇరవై రెండవ రోజు పురస్కరించుకుని సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున గోపూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేక, పుష్పార్చన పూజలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. శ్రీపాదరాజశేఖర ఘనాపాఠి నేతృత్వంలో లక్షపత్రి పూజల్లో పెద్దాపురానికి చెందిన శివరామశర్మ, కాకినాడకు చెందిన మూర్తి, సామర్లకోటకు చెందిన రమణదంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద జరిగిన ఆకాశదీప పూజల్లో శివరామశర్మ, మూర్తి, రమణ దంపతులు, పలువురు భక్తులు ఆశీనులయ్యారు. కార్తీక దీపారాధన సంఘ సభ్యులుచే నిర్వహించిన జ్యోతిర్లింగార్చన పూజలలోనూ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో భాగంగా ఆలయ ఆవరణలో సుమారు 800 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

భక్తులకు అల్పాహారం పంపిణీ

కాగా శనివారం రాత్రి ఆలయానికి విచ్చేసిన భక్తులకు సామర్లకోట లయన్స్ భీమేశ్వరా క్లబ్ సౌజన్యంతో చక్కెర పొంగలి, పులిహోర అల్పాహారం, వాటర్‌ప్యాకెట్లు పంపిణీ చేశారు. సుమారు 600 మంది భక్తులకు అల్పాహారం అందజేశారు. ఈ సేవల్లో చిత్తులూరి రాజా, ఈదర ఈశ్వర్‌కుమార్, అమలకంటి శ్రీనివాసరావు, గుండు శంకరరావు, మద్దిరాల శివనాగకృష్ణ, మాజేటి కృష్ణ, మేకా శ్రీను, కర్రి ఆదినారాయణ రెడ్డి, కానుబోయిన విజయకృష్ణ పాల్గొన్నారు.

'నిరంతర అభ్యసనతో జ్ఞానం పెరుగుదల'

జేఎన్టీయూకే, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నిరంతర అభ్యసన ద్వారా జ్ఞానం ఎప్పుడూ పెరుగుతూ ఉంటుందని కాకినాడ జేఎన్టీయూకే ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ తెలిపారు. వర్సిటీలో ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో యూసీఈకే పరిపాలనాభవనంలోని పీజీ రీసెర్చ్ ల్యాబ్‌లో రెండు రోజుల పాటూ నాన్‌టీచింగ్ సిబ్బందికి నిర్వహించనున్న ఎంఎస్ ఆఫీస్‌పై శిక్షణా కార్యక్రమాన్ని శనివారం రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో సమాచార నిర్వహణ అంతా డిజిటలైజ్ అవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా డిజిటలైజేషన్‌కు అధిక ప్రాధాన్యతనిస్తున్నదని ఎంఎస్ ఆఫీస్ టూల్స్‌లోని అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్‌ను నేర్చుకుని తమ పనిని మరింత సులభతరం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఐఐపీటీ డైరెక్టర్ డాక్టర్ బీటీకృష్ణ, ఎం.వెంకట్, కె.రఘురాం, కశ్యప్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి ఎమ్మెల్యే నానాజీ పూజలు

భీమవరంటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని గునుపూడి సోమేశ్వరస్వామిని శనివారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. అర్చకుడు చెరుకూరి రామకృష్ణ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరఫున శేషవస్త్రం, ప్రసాదాన్ని అందించారు. ఆయనను జనసేన ప్రొటోకాల్ చైర్మన్ మల్లినీడి తిరుమలరావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. చల్లా రాము, జన సైనికులు ఉన్నారు.



సోమేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే నానాజీ

చిన్నారి వైద్యానికి రూ.70 వేలు వితరణ

సర్పవరం జంక్షన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ యంగ్ మైండ్స్ (రేపటి కోసం) సంస్థ ఆధ్వర్యంలో శనివారం భానుగుడి క్యాపిటల్ ఆసుపత్రిలో కాలిన గాయాలతో బాధపడుతున్న చిన్నారి జాహన్విశ్రీ వైద్యం కోసం రూ.70 వేలు చెక్కును శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి చైర్మన్, పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రిచంద్రశేఖర్ చేతులమీదుగా ఆసుపత్రి నిర్వాహకులకు అందించారు. నాగులచవితినాడు ప్రమాదవశాత్తు 9ఏళ్ల జాహన్విశ్రీ గౌనుకి ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుని తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరింది. తండ్రి నిరుపేద ఆటోడ్రైవర్ కావడంతో చిన్నారి శరీరం తీవ్రంగా కాలిపోవడంతో వైద్యం చేయించే ఆర్థిక స్తోమతు లేక క్యాపిటల్ ఆసుపత్రి నిర్వాహకులు, డాక్టర్ల బృందం సుమారు రూ.3.5 లక్షలు దాకా చిన్నారి శస్త్రచికిత్సకు సమకూర్చారు. తదుపరి వైద్యం కోసం చిన్నారి తండ్రి ఆర్థిక సహకారం కోరగా సంస్థ సభ్యులు రూ.70 వేల విరాళాన్ని సాయం చేసినట్టు యంగ్ మైండ్స్ ఫౌండర్ వాకాడ వెంకటరమణ తెలిపారు. సంస్థ గౌరవాధ్యక్షులు నరాల కృష్ణకుమార్, కె.కామేశ్వరరావు, డాక్టర్ సందీప్, డాక్టర్ నితిన్, డాక్టర్ సుభాష్, డాక్టర్ సృజన, కేవీ రమణ, బి.లీల, ఎండీ కరీమ్ పాల్గొన్నారు.

పాదగయను సందర్శించిన జోగి నాయుడు



పిఠాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని సినీనటుడు జోగి నాయుడు దంపతులు సందర్శించారు. ఆలయంలో కుక్కుటేశ్వరస్వామి, స్వయంభ దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

నేడు గుండెవ్యాధుల శిబిరం

ప్రత్తిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జై భవానీ ఆసుపత్రి వద్ద ఆదివారం గుండెవ్యాధుల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. రాజమహేంద్రవరం బొల్లినేని ఆసుపత్రికి చెందిన గుండె వ్యాధిశస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఎం.ఫణితేజ పరీక్షలు నిర్వహిస్తారని, ప్రతిపాడు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

'వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి'



సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

చింతూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వలంటీర్ల డిమాండ్లను నెరవేర్చాలన్న ప్రధాన డిమాండ్‌తో శనివారం వలంటీర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. పలువురు వలంటీర్లు మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ పవన్‌కళ్యాణ్ తమకు న్యాయం చేయాలని వారు కోరారు. వలంటీర్లకు రాజకీయ రంగు పూయవద్దని వారు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వారు కోరారు. నెలకు రూ.10వేలు వంతున వేతనం చెల్లిస్తామని కూటమి నాయకులు పలుమార్లు పేర్కొనడం జరిగిందని, తమను విధుల్లోకి తీసుకొని ఉద్యోగభద్రత కల్పించాలని వారు పేర్కొన్నారు.

ఇందుకూరుపేటలో సత్యసాయిబాబా జయంతి



ఇందుకూరుపేటలో సత్యసాయిబాబా జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

దేవీపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేట సత్యసాయి పంప్ హౌస్‌వద్ద సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత బాబా చిత్రపటానికి పూలమాలలు వేశారు. వాహనదారులు, భక్తులు పులిహోర పంపిణీ చేశారు. సత్యసాయి సిబ్బంది యూనియన్ అధ్యక్షుడు కట్టుమూరి వీరబాబు మాట్లాడుతూ భగవాన్ శ్రీసత్యసాయిబాబా గిరిజన, మెట్ట ప్రాంతంలోని ప్రజలందరికీ సురక్షితమైన తాగునీటిని అందించి ప్రజలందరికీ ఆరోగ్యప్రదాతగా నిలిచారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించారన్నారు. కొట్టు తాతాజీ, లక్ష్మీనారాయణ, అర్జునుడు, టి.కృష్ణమూర్తి, కుమార్, సాయి పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సాయం



అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఇచ్చిన ఆర్థిక సహాయం అందిస్తున్న కూటమి సభ్యులు

వై.రామవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం యార్లగడ్డ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈనెల 21న అగ్ని ప్రమాదం సంభవించి ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబం అల్లంకుల మల్లయ్య, కాంతం దంపతులకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, విజయభాస్కర్ రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారని మండల తెలుగుదేశం అధ్యక్షుడు పల్లాల వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం ఆ మొత్తాన్ని కూటమి సభ్యులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్ 50 కేజీల రైస్‌బ్యాగ్, సర్పంచ్ పల్లాల పద్మావతి బట్టలు, కూరగాయలు, గుద్దాటి సుబ్రహ్మణ్యం బట్టలు, రెడ్డి సత్యనారాయణ రూ.1000 బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వారెడ్డి, అల్లూరి సత్యనారాయణ, తాతబ్బాయి, మఠం శేఖర్, పుష్పరాజు, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి సామగ్రి అందజేత



అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న జమాల్‌ఖాన్

కూనవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వంకోల్పోయిన చూచి రేవులగూడెం గ్రామానికి చెందిన తెల్లం ముత్తయ్య కుటుంబానికి జమాల్‌ఖాన్ ట్రస్టు ఆధ్వర్యంలో వితరణ అందజేశారు. ట్రస్టు చైర్మన్ జమాల్ ఖాల్ చేతుల మీదుగా రూ.30వేలు విలువచేసే ఇంటి పైకప్పు రేకులు, ఇనుపరాడ్లను అందజేశారు. ఈసందర్భంగా జమాల్‌ఖాన్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతీఒక్కరినీ ఆదుకుంటామని అంతేకాకుండా ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహాయసహకారాలు అందించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, గడేశుల చందు, తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు ఎడమ కాలువ గట్టు బలహీనం

ప్రత్తిపాడు, నవంబరు23(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నగర దాహార్తి,విశాఖ స్టీల్ ప్లాంట్ నీటి అవసరాలుతీర్చే ఏలేరు ఎడమ కాలువగట్లు ప్రత్తిపాడు నియోజకవర్గంలో దారుణంగా దెబ్బతిన్నాయి. ఏలేశ్వరంనుంచి విశాఖపట్నంకు ఏలేరు ఎడవ కాలువ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీటి సరఫరా జరిగే ఏలేరు ఎడమ కాలువ ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి గ్రామాల మీదుగా వెళుతుంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఏలేరు ఎడవ కాలువగట్లు కోతకు గురయ్యాయి. కొన్నిచోట్ల పశువుల వల్ల గట్లు దెబ్బతిన్నాయి.దీంతో ఏలేరు ఎడవ కాలువ నిండానీటిని వదిలేందుకు గండ్లుపడే అవకాశం ఆటంకంగా మారింది. దీంతో ఈ కాలువరెండు మీటర్ల దిగువ నుంచి ప్రవహించే విధంగా ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి నీటిని వదులుతున్నారు. ఏమాత్రం వర్షాలు సంభవించినా కాలువ ఉధృతంగా ప్రవహించిన ఏలేరు ఎడమ కాలువ గండ్లు పండే ప్రమాదం ఉంది. దీంతో ఏలేరు కాలువకు గండ్లుపడితే తమ పంట పొలాలు ముంపుబారిన పడే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బలహీన పడిన ఏలేరు గట్లుపటిష్టానికి ఏలేరు కాలువ నిర్వాహణాధికారులు చర్యలు చేపట్టాలని రైతులు, గ్రామాలప్రజలు కోరుతున్నారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ అధికారులు

రౌతులపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి గ్రామంలో ఏ అనుమతులు లేకుండా యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో రాత్రుళ్లు, ప్రైవేట్ భూముల్లో పగలు గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. సొంత సైట్‌లలో ఫిల్లింగ్ చేసేందుకు గ్రావెల్‌ను తరలిస్తున్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ గ్రావెల్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పేదల ఇళ్ల స్థలాల్లో గ్రావెల్ తవ్విన దృశ్యం, ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్

ప్రజా పోరాటలతోనే ప్రతిపక్షాన్ని నిలబెడతాం

సీపీఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు

ప్రత్తిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాటాలతోనే నిజమైన ప్రజా ప్రతిపక్షాన్ని నిలబెడతామని సీపీఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు పిలుపునిచ్చారు. స్థానిక లిబరేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు మాత్రమే కాదు పీపుల్స్ సిక్స్‌కు కూడా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు న్యాయమైన విద్య, ప్రభుత్వం ఉచితంగా అందించాలని నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని.విద్యారంగ ప్రైవేట్ పరం నిలిపివేయాలని, ప్రతి సంవత్సరం 17లక్ష ఉద్యోగాలు కల్పించాలని ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు రూ.5వేలు నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. ఈనెల డిసెంబరు 4న విజయవాడ జింకాన మైదానంలో జరిగే ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలని బంగార్రాజు కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి మహోత్సవాలు

జగ్గంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లపువీధిలోని శ్రీమద్ జగద్గురువిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 87వ వార్షికోత్సవ మహోత్సవాలు ఈనెల 20నుంచి 29 వరకు బ్రహ్మశ్రీ వరద బావర్లింగం గారి కుమారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అందులో భాగంగా శనివారం సాయంత్రం రావులమ్మ నగర్‌లోని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ క్యాంప్ ఆఫీసులో పోతులూరి వీరబ్రహ్మంగారి ఎనిమిదవ తరం ముని మనవడు కంది మల్లయ్య పల్లె కడప జిల్లా నుంచి విచ్చేసిన బ్రహ్మశ్రీ నోస్సం వీరంభటయ్య స్వామిని ఘనంగా సత్కరించారు. ఆదివారం జగ్గంపేట పురవీధుల్లో స్వామివారిని ఊరేగించి వీరబ్రహ్మంస్వామిపై సందేశాన్ని అందిస్తారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షులు మారిశెట్టి భద్రం, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, చదరం చంటిబాబు,బస్వా చిన్నబాబు, కాళ్ళ వెంకటేష్, జగ్గంపేట శ్రీ కామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులున్నారు.

సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్టు

జగ్గంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జంతువులు, సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న నిందితుడ్ని జగ్గంపేట పోలీసులు అరెస్టు చేశారు. గోకవరానికి చెందిన ప్రేమ్‌కుమార్ కోళ్లు, మేకలు, సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్నాడు. అతడిని అరెస్టు చేసి 4 కోళ్లు, యూనికాన్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.70వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గండేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో గండేపల్లి నుంచి ఎన్టీరాజాపురం జాతీయరహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుబ్రహ్మణ్యం అనే వ్యక్తికి గాయాలయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. సుబ్రహ్మణ్యం కాకినాడ నుంచి తిరుమలయ్యపాలెం వారి అత్తవారింటికి వెళ్లే సమయంలో ఎన్టీరాజాపురం జాతీయ రహదారిపైకి వచ్చేసరికి రాజమండ్రి నుంచి జగ్గంపేట వైపు వెళ్లే ట్రాలీ లారీ ఢీకొనడంతో అతనికి గాయాలయ్యాయి. దీంతో ఆసుపత్రికి తరలించారు.

జార్ఖండ్‌లో కూటమి గెలుపుపై సంబరాలు

ప్రత్తిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రంలో శనివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ కూటమి విజయం సాధించడంపై ప్రత్తిపాడులో సీపీఎం లిబరేషన్, కాంగ్రెస్ కార్యాలయాల్లో వేర్వేరుగా సంబరాలు నిర్వహించారు. వయనాడ్‌లో యువ నాయకురాలు ప్రియాంక గాంధీ భారీ మెజార్టీతో విజయంతో కాంగ్రెస్ పార్టీ జార్ఖండ్‌లో విజయం సాధించడం పట్ల స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో డీసీసీబీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను, కార్యకర్తలు ఇరుగుల చక్రం, కందిమళ్ల శామ్యూల్, డి.గోపయ్యలు స్వీట్లు పంచారు. అలాగే లిబరేషన్ పార్టీ కార్యాలయంలో కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు కేక్ కట్ చేశారు. జార్ఖండ్ రాష్ట్రంలో సింద్రి నియోజకవర్గం నుంచి లిబరేషన్ అభ్యర్థి గెలుపొందడంపై హర్షం హర్షం వ్యక్తం చేశారు.



ప్రత్తిపాడు లిబరేషన్ పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న బుగతా బంగార్రాజు

'ఆదిత్య'లో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం



ఆదిత్యలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

గండేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెంలో ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఫోరెనిక్స్ సైన్స్ విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సంబంధ్ హెల్త్ ఫౌండేషన్(ఎస్‌హెచ్‌ఎఫ్) సహకారంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రారంభించిన డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి డ్రగ్స్ ప్రభావాలపై అవగాహన పెంచడానికి ప్రతిజ్ఞ చేశారు.

క్రికెట్ టీమ్ ఎంపిక

ఆదిత్య యూనివర్శిటీలో 2024-25కి సంబంధించిన క్రికెట్ టీమ్ సెలక్షన్‌ను డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఆల్‌రౌండర్ క్యాటగిరీలు పరీక్షించి మేలైన ప్రదర్శన చేసిన వారిని తీసుకుని అత్యుత్తమ జట్టును ఎంపిక చేశామని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ రవి తెలిపారు. క్రీడాకారులను యూనివర్శిటీ యాజమాన్యం అభినందించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ సెక్యూరిటీ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అనే అంశంపై బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ హాజరై విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ యువి శివనాగబాబు, ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడులో స్వచ్ఛభారత్ అభయాన్ కార్యక్రమం

ప్రత్తిపాడు, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మినర్వా కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు శనివారం స్వచ్ఛభారత్ అభయాన్ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని మినర్వా ఫౌండర్ డీవీఎస్ రాజు రమేష్ ప్రారంభించారు. 70 మంది జూనియర్, సీనియర్ విభాగాలకు చెందిన ఎన్‌సీసీ అధికారులు, ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ హైవేపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైవే వెంబడి చెత్తా చెదారాలను వాటర్ బాటిల్స్‌ను తొలగించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ ఎస్.రవికుమార్, డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ జి.హరిబాబు, హైస్కూల్ హెచ్ఎం మల్లికార్జున్ పాల్గొన్నారు.



హైవే వెంబడి చెత్తచెదారాలు తొలగిస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరంలో పేదలకు దుప్పట్ల పంపిణీ

ఏలేశ్వరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శనివారం స్థానిక వాగు వారి వీధిలో సత్యసాయిబాబా 99వ జయంతి పురస్కరించుకుని సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో కౌన్సిలర్ అలమండ చలమయ్య చేతులమీదుగా సుమారు 100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా బాబా ఆలయంలో పూజలు, భజనలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. మట్టే సుబ్బారావు, సత్యసాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపణీ చేస్తున్న కౌన్సిలర్

సారాతో వ్యక్తి అరెస్ట్



సారాతో నిందితుడిని అరెస్ట్ చేసిన ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు

ప్రత్తిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది శనివారం కిర్లంపూడి గెద్దనాపల్లిలో దాడులు నిర్వహించి 55 లీటర్ల సారాతో గంటా రమణను అరెస్ట్ చేశారు. అలాగే కృష్ణవరం గ్రామంలో సారా స్థావరాలపై దాడి చేసి 1400లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సీఐ కేస్వామి, ఎక్సైజ్ ఎస్ఐ వంశీరామ్ ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

చింతూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఒడ్డు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం ప్లేట్లు గ్లాసులు టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి మాట్లాడారు. రంపచోడవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. విజయభాస్కర్ ముమ్ముందు మరిన్ని ప్రజాసేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఆసిఫ్, సురేష్ చౌదరి, శ్రీరాంరెడ్డి, కట్ట శంకర్, శ్యామల వినోద్, రవికుమార్, మని, శేఖర్, స్వరూప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

26న జరిగే మహాధర్నాను విజయవంతం చేయండి

దేవీపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నిర్వాసితులు, అటవీహక్కుల, రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 26న తలపెట్టిన దేశవ్యాప్త మహాధర్నాను విజయవంతం చేయాలని ఏజెన్సీ గిరిజన రైతు కూలీ సంఘం నాయకులు కోరారు. రైతాంగానికి అన్ని పంటలకు చట్టబద్ధ కనీస మద్దతు ధర ఇవ్వాలని, రైతాంగంపై రుణ భారాలు రద్దు చేయాలని, అడవులపై ఆదివాసుల హక్కులు కాలరాసే అటవీ సంరక్షణ చట్టాలు రద్దుచేయాలని తదితర డిమాండ్లతో మహాధర్నా నిర్వహిస్తున్నామని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హైస్కూల్లో మాక్ పోలింగ్



లంపకలోవలో మాక్ పోలింగ్ దృశ్యం

ప్రత్తిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని లంపకలోవ జడ్పీ హైస్కూల్లో శనివారం విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల్లో ప్రజాస్వామ్య వ్యవస్థ, విలువలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని కత్తుల వీర రాఘవకుమార్ తెలిపారు. యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు, ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గరికపాటి సురేష్, ఏపీటీఎస్ జిల్లా కార్యదర్శి కంచి అప్పా రావు, ఉపాధ్యాయులు ఎస్.రాజేష్. జి.సురేష్, ఎ.కామేశ్వరరావు, ఎస్.గణపతి,టీవీ రమణరావు పాల్గొన్నారు.

గోవిందరెడ్డి పాదయాత్రకు కత్తిపూడిలో స్వాగతం

శంఖవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి చేస్తున్న భద్రాచల పాదయాత్రకు కత్తిపూడిలో ఘనం స్వాగతం లభించింది. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన సందర్భంలో ఆయన బయటకు వచ్చి సీఎం అయితే భద్రాచలం కాలినడకన వస్తానని మెక్కుకున్నట్టు గోవిందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వెన్నా శివ, కంచిబోయిన శ్రీను, కొయ్యా రమణ, సాదనాల లక్ష్మీబాబు, కేశంగి జనార్ధన్, కీర్తి కుమార్ ఉన్నారు.

కార్తీక దీపోత్సవం

ప్రత్తిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లిలో గల అపీత కుంచాబ సమేత అరుణాచల దేవస్థానంలో శనివారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. మండలం వ్యాప్తంగా పెద్ద ఎత్తున మహిళాభక్తులు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక శనివారం పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కార్తీక వన సమారాధన

శంఖవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడిలో యాదవ వీధిలో కృష్ణాలయం వద్ద భారీ కార్తీక వన సమారాధన నిర్వహించారు. మాలధారణ చేసిన అయ్యప్పమాలధారులు, యాదవ పెద్దల ఆధ్వర్యంలో ఉదయం నుంచి కార్తీకదామోదరునికి పూజలు నిర్వహించారు. భారీస్థాయిలో భక్తులు, గ్రామస్తులు దేవుని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు.

దాబా హోటళ్లను పరిశీలించిన డీఎస్పీ

గండేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయరహదారిని ఆనుకుని ఉన్న దాబా హోటళ్లను శనివారం రాత్రి పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ పరిశీలించారు. దాబాల్లో మద్యం అమ్మరాదని, తాగరాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారిని ఆనుకుని దాబాల ఎదురుగా వాహనాలు నిలపవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలుపరాదని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

సత్యసాయి జయంతి

జగ్గంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొంగల రావి చెట్టు సత్యసాయి బాబా మందిరంలో సత్యసాయిబాబా వారి 99వ జయంతి వేడుకలు సాయిబాబా భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తన, సుప్రభాత సేవా నిర్వహించారు. మధ్యాహ్నం స్కూల్ పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేశారు. సాయంత్రం భక్తులందరికీ కలిసి వేడుకలు నిర్వహించి స్వీట్స్ ప్రసాదాలు అందించారు. ఇదే వల రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నియమితులైన కొత్త కొండబాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెంట్రా ప్రగడ రమేష్, కాకి శ్రీను, గొగుల సురేష్, కె. సూరిబాబు, పిచ్చుకమాధవరావు, జాజుల అచ్యుత్, లక్కాకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాకతిప్పలో అన్నదానం

కొత్తపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాకతిప్పలో శ్రీకృష్ణ ఆలయం మొదటి వార్షికోత్సవం పురస్కరించుకుని యాదవ సంక్షేమ సంఘం నాయకులు, మాజీ సర్పంచ్ పులగం అప్పలరాజు కుమారులు అన్నదానం నిర్వహించారు. సుమారు 5 వేల మంది పాల్గొన్నారు.